RNI No : TELTEL/2022/85167

# పద్మక్రాంతి

(వాస్తవాలు వెలుగులోకి)

తెలుగు దినపత్రిక

| సంపుటి : 04 | సంచిక : 32 | రంగారెడ్డి | ఎడిటర్ : గంజి వెంకటేశ్ | శనివారం, జనవరి 24, 2026 | పేజీలు : 8 | వెల: 3 రూ. |
|---|---|---|---|---|---|---|

| Volume: 04 | Issue :32 | Rangareddy | Editor: Ganji Venkatesh | Saturday, January 24, 2026 | Pages:8 | Price: 3/- |
|---|---|---|---|---|---|---|

## నేతాజీ కి ప్రధాని మోడీ ఘన నివాళి

### ధైర్యసాహసాలకు నేతాజీ నిదర్శనమని వ్యాఖ్య



న్యూఢిల్లీ,జనవరి23(పద్మక్రాంతి):

స్వాతంత్య్ర సమర యోధుడు నేతాజీ సుభాష్ చంద్రబోస్ 129వ జయంతిని పురస్కరించుకుని ప్రధాని నరేంద్ర మోదీ శుక్రవారం నివాళులు అర్పించారు. భయమెరుగని నాయకత్వానికి, అచంచల దేశభక్తికి నేతాజీ ప్రతీక అని కొనియాడారు. ఆయన సేవలను గుర్తు చేసుకుంటూ ఎక్స్ వేదికగా పోస్టు పెట్టారు. ధైర్యసాహసాలు, పట్టుదలకు నేతాజీ సుభాష్ చంద్రబోస్ ప్రతీక అని, దేశానికి ఆయన సేవలు అనితరసాధ్యమని ప్రధాని మోదీ ప్రశంసించారు. ఆయన జయంతిని యావత్ దేశం పరాక్రమ్ దివస్‌గా జరుపుకుంటోందని అన్నారు. అచంచల దేశభక్తికి, భయమే తెలియని నాయకత్వ పటిమకు అసలైన ప్రతీకగా నిలిచే నేతాజీ రాబోయే తరాలకు స్ఫూర్తిగా నిలుస్తారని కొనియాడారు.

## జనగణనకు కేంద్రం రంగం సిద్ధం

- 33 ప్రశ్నలతో వివరాల సేకరణ
- గెజిట్ విడుదల చేసిన సర్కార్



న్యూఢిల్లీ,జనవరి23(పద్మక్రాంతి):

దేశ వ్యాప్తంగా జనగణనకు రంగం సిద్ధమైంది. రెండు దశల్లో జనగణన చేపట్టాలని ఇప్పటికే కేంద్రం ప్రభుత్వం ప్రకటించిన సంగతి తెలిసిందే. జనగణనలోనే కులగణన కూడా కేంద్రం చేపట్టనుంది. 2026 ఏప్రిల్ 1 నుంచి తొలిదశ జనగణన ప్రారంభం కానుంది. తొలిదశలో గృహ గణన కోసం కేంద్ర హోం శాఖ ప్రశ్నావళిని రూపొందించింది. 33 ప్రశ్నలతో మోదీ సర్కార్ గెజిట్ విడుదల చేసింది. ఇంటి వివరాలతో పాటు ఇంటర్‌నెట్, మొబైల్ ఫోన్లు, కంప్యూటర్లు, ల్యాప్‌టాప్‌ల వాడకం, వాహన వినియోగం 3 లో




## మేడారంలో జనజాతర

### భారీగా తరలి వస్తోన్న జనం

### ప్రత్యేక రైళ్లను నడపనున్న దక్షిణమధ్య రైల్వే

వరంగల్,జనవరి23(పద్మక్రాంతి):

సమ్మకక్క సారలమ్మ జాతరకు మేడారం జనసంద్రంగా మారుతోంది. జాతర ప్రారంభానికి ముందు జనం తండోపతండాలుగా వస్తున్నారు. వాహనాల రద్దీ పెరిగింది. ఇప్పటికే ఆర్టీసీ ప్రత్యేక బస్సులను నడుపుతోంది. ఇప్పుడు దక్షిణమధ్య రైల్వే కూడా వివిధ ప్రాంతాల నుంచి వరంగల్, కాజీపేటల వరకు ప్రత్యేక రైళ్లను నడుపనున్నట్లు వెల్లడించింది. ఈ నెల 28 నుంచి 31 వరకు ములుగు జిల్లా తాడ్వాయి మండలం మేడారంలో జరిగే సమ్మక్క-సారలమ్మ జాతరకు దక్షిణమధ్య రైల్వే మేడారం జాతర ప్రత్యేక రైళ్లను ఈ నెల 28 నుంచి నడుపనుంది. రాష్ట్రంలోని సికింద్రాబాద్, మంచిర్యాల్, సిరిపూర్‌కాగజ్‌నగర్, ఆదిలాబాద్, నిజామాబాద్, ఖమ్మం ప్రాంతాల నుంచి మేడారం జాతర ప్రత్యేక రైళ్లు వరంగల్, కాజీపేటల వరకు నడుస్తాయని దక్షిణమధ్య రైల్వే ముఖ్య పౌరసంబంధాల అధికారి ఎ.శ్రీధర్ విడుదల చేసిన ప్రకటనలో తెలిపారు. ఈ నెల 28 నుంచి ఫిబ్రవరి 1 వరకు నడిచే మేడారం జాతర ప్రత్యేక రైళ్లు పూర్తిగా అన్ రిజర్వ్‌డ్ జనసాధారణ రైళ్లని జాతర వెళ్లే భక్తులు ఈ రైళ్లను వినియోగించుకోవాలని కోరారు. ఇవి ఆయా మార్గాల్లోని అన్ని స్టేషన్లలో ఆగుతాయని తెలిపారు. ఈనెల 28, 30, ఫిబ్రవరి 1 తేదీల్లో సికింద్రాబాద్ -మంచిర్యాల్- సికింద్రాబాద్ ప్రత్యేక రైళ్లు కాజీపేట మీదుగా కాజీపేట మీదుగా నడుస్తాయి. సికింద్రాబాద్- మంచిర్యాల్ రైలు(07495) ఉదయం 5.45 గంటలకు సికిందరాబాద్‌లో బయలుదేరి ఉదయం 8.45 గంటలకు కాజీపేటకు, మధ్యాహ్నం 1.30 గంటలకు 3 లో





## వ్యవసాయం ఓ విజ్ఞానం

- జై కిసాన్‌కు తోడు..జై విజ్ఞాన్..జై అనుసంధాన్
- గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ పిలుపు
- సూర్యాపేటలో పలు కర్యాక్రమాలకు హాజరు

సూర్యాపేట,జనవరి23(పద్మక్రాంతి):




'వ్యవసాయం ఒక విజ్ఞానమని' ఇప్పటివరకు ఉన్న జై జవాన్, జై కిసాన్, జై విజ్ఞాన్ నినాదం ప్రస్తుతం జై జవాన్, జై కిసాన్, జై విజ్ఞాన్ ,జై అనుసంధాన్ గా మారిందని రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ అన్నారు. శుక్రవారం ఆయన సూర్యాపేట జిల్లా, మఠంపల్లి మండలం, మట్టపల్లి లోని శ్రీ లక్ష్మినరసింహస్వామిని సతీ సమేతంగా దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు.ఆలయ అర్చకులు, వేద పండితులు,అధికారులు గవర్నర్ కు పూర్ణకుంభంతో స్వాగతం పలికి వేదాశీర్వచనం ఇచ్చి ప్రసాదం అందజేశారు.దేవాలయ ఆవరణలో వివిధ శాఖలు ఏర్పాటు చేసిన స్టాల్స్ ని సందర్శించి లబ్ధిదారులు, విద్యార్థులతో ముఖాముఖి మాట్లాడారు. ఆ తర్వాత వేదిక వద్ద హుజూర్‌నగర్ సమీపంలోని ముగ్దుమ్ నగర్ వద్ద 100 ఎకరాలలో 150 కోట్ల రూపాయల వ్యయంతో నిర్మించనున్న వ్యవసాయ కళాశాలకు శంకుస్థాపన చేశారు .అంతేగాక కోదాడ సమీపంలో 50 కోట్ల రూపాయల వ్యయంతో నిర్మిస్తున్న జవహర్ నవోదయ 3 లో

## మేడారం జాతరకు కేంద్రం భారీ సహాయం

### రూ.3 కోట్ల 70 లక్షల నిధుల విడుదల

### కేంద్రమంత్రి కిషన్ రెడ్డి చొరవతో మంజూరు



న్యూఢిల్లీ,జనవరి23(పద్మక్రాంతి):

ఎట్టకేలకు మేడారం జాతరకు కేంద్రం భారీ సహా-యాన్ని అందించింది. కేంద్ర ప్రభుత్వం రూ.3 కోట్ల 70 లక్షల నిధులను విడుదల చేసింది. గిరిజన కుంభమేళాగా ప్రసిద్ధి చెందిన, ఆసియాలోనే అతిపెద్ద గిరిజన పండుగ అయిన మేడారం జాతరకు కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి జి.కిషన్ రెడ్డి చొరవతో ఈ నిధులను విడుదల చేసింది. కేంద్ర పర్యాటక మంత్రిత్వ శాఖ, గిరిజన వ్యవహారాల 3 లో

## లీకులను ఎవరూ నమ్మొద్దు..

### సిట్ అడిగిన ప్రశ్నలకు సమాధానం ఇచ్చా

### లీకులతో వ్యక్తిత్వ హననానికి పాల్పడుతున్నారు

### లీకులను ఎవ్వరూ నమ్మకండన్న కెటిఆర్



3 లో

## ఇంకెన్నాళ్లీ డైవర్షన్ పాలిటిక్స్

### సృజన్ బాగోతంతో సిట్ నోటీసులు

### రెండేళ్లయినా లీకుల వ్యావహారమేనా

### కోల్ స్కామ్‌తో కాంగ్రెస్ పతనం ఖాయం

### మీడియా సమావేశంలో హరీష్ రావు విమర్శలు

హైదరాబాద్,జనవరి23(పద్మక్రాంతి):



సీఎం రేవంత్‌వి డైవర్షన్ పాలిటిక్స్ అని మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీశ్‌రావు సెటైర్లు గుప్పించారు. తెలంగాణ భవన్‌లో హరీశ్‌రావు శుక్రవారం మీడియాతో మాట్లాడారు. నాడు కోల్ స్కాం యూపీఏ ప్రభుత్వ పతనానికి కారణమైందని ప్రస్తావించారు. నేడు కాంగ్రెస్ ప్రభుత్వ పతనానికి కోల్ స్కాం నాందిగా మారిందని తెలిపారు. సీఎం రేవంత్‌రెడ్డి బామ్మర్ది బాగోతం బయటపెట్టినందుకే నోటీసులు పంపించారని చెప్పుకొచ్చారు. కోల్ స్కాంపై సీబీఐ లేదా సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. సీఎం రేవంత్‌రెడ్డి 3 లో

## టీవీ సీరియల్‌లా సాగుతున్న సిట్ విచారణ

### ఫోన్ ట్యాపింగ్ దొంగలను పట్టుకోని ప్రభుత్వం

### కెసిఆర్ కుటుంబం ఎందరి జీవితాలనో నాశనం చేసింది

### కేంద్రమంత్రి బండి సంజయ్ ఆరోపణలు

కరీంనగర్,జనవరి23(పద్మక్రాంతి):

ఫోన్ ట్యాపింగ్ కేసులో సిట్ విచారణ సీరియల్‌లా కొనసాగుతోందని కేంద్రమంత్రి బండి సంజయ్ ఎద్దేవా చేశారు. దొంగే దొంగ అన్నట్లు కేటీఆర్ వ్యవహారం ఉందన్నారు. కరీంనగర్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో సంజయ్ మాట్లాడారు. సిట్ విచారణ పేరుతో కాంగ్రెస్ ప్రభుత్వం నాటకాలాడుతోందని విమర్శించారు. కేటీఆర్ సిరిసిల్ల కేంద్రంగా అక్రమంగా ఫోన్లు ట్యాప్ చేయించారు. ఆయన చేసిన దారుణాలతో కొన్ని కుటుంబాలు మునిగాయి. ఫోన్ ట్యాపింగ్ కేసులో ఎలాంటి అరెస్ట్‌లు జరగవు. కేసీఆర్ కుటుంబసభ్యులను అరెస్ట్



3 లో

## చట్టప్రకారమే ట్యాపింగ్ విచారణ

- ఆధారాలు, రికార్డుల ఆధారంగా కెటిఆర్ విచారణ
- సిట్ చీఫ్ సజ్జన్నార్ వెల్లడి

హైదరాబాద్,జనవరి23(పద్మక్రాంతి):

మాజీ మంత్రి కేటీఆర్ ఫోన్ ట్యాపింగ్ కేసులో సిట్ విచారణకు శుక్రవారం హాజరైన అనంతరం సిట్ చీఫ్ సజ్జనార్ స్పందించారు. ఆధారాలు, రికార్డులు ముందుంచి కేటీఆర్‌ను విచారణ జరిపామని స్పష్టం చేశారు. సాక్ష్యులను ప్రభావితం చేయొద్దని చెప్పామని తెలిపారు. అవసరమైతే మళ్లీ 3 లో



శనివారం, జనవరి 24, 2026

పద్మక్రాంతి

RNI No : TELTEL/2022/85167

తెలుగు దినపత్రిక

## సంపాదకీయం

# మహిళా శక్తికి ఐద్వా చిరునామా కావాలి !

మహిళలు అన్ని రంగాల్లో విప్లవం, విజయాలు సాధిస్తున్నా ఇంకా ఎక్కడో లోటు కనిపిస్తూనే ఉంది. నేటికీ మహిళలు భారతదేశంలో స్వేచ్ఛగా తిరగలేని దుస్థితలోనే ఉన్నారు. ధైర్యంగా ఒంటరిగా వెళ్లలేని పరిస్థితులు నేటికీ ఉన్నాయి. బట్టల విషయంలో ఇటీవల నటుడు శివాజీ చేసిన ఓ వ్యాఖ్యపై రచ్చ చేశారే తప్ప..అందులో నిజమెంత అన్నది మహిళలే ఆలోచించలేకపోయారు. అంగాంగ ప్రదర్శన, కురచ బట్టలు, అర్థనగ్న ప్రదర్శన వంటివన్నీ ఏ స్వేచ్ఛ కిందకు వస్తాయో చెప్పాలి. యత్ర నార్యంతు పూజ్యతే....అన్న నానుడిని తుంగలో తొక్కాం. ప్రధానంగా మృగసామ్రాజ్యం ఇంకా నడుస్తోంది. ఈ సమాజం మారాలంటే ఇంకొంత కాలం పడుతుంది. అందుకు మనమంతా పోరాడాలి. మహిళలను, చిన్నపిల్లలను గౌరవించే దాకా పోరాడాలి. వారికి రక్షణ కల్పించే వరకు పోరాడాలి. వారు స్వేచ్ఛగా తిరగగలిగే పరిస్థితులు వచ్చే వరకు పోరాడాలి. ఇవన్నీ కూడా సమిష్టి పోరాటాలతోనే సాధ్యం అవుతాయి. పనిప్రదేశాలు, ఉద్యోగాలు, బస్సులు, రైళ్లు, రాజకీయ పార్టీలు, సినిమాలు.. విద్యారంగం..ఇలా ఒక్కటేమిటి అన్ని చోట్లా మృగాళ్ల పెత్తనమే తప్ప ఆడ పెత్తనం కానరావడం లేదు. నేటి పాలనలో మహిళలు అనేక రకాల సమస్యలు ఎదుర్కొంటున్నారు. పోరాడి సాధించుకున్న హక్కులన్నీ కాలరాయబడుతున్నాయి. పాలనారంగంలో మహిళలు అక్కడక్కడా ఉంటున్నా న్యాయం దక్కడం లేదు. మమతా బెనర్జీ లాంటి మహిళ పాలనలో ఉన్న బెంగాల్లో కూడా నిత్యం అత్యాచారాలు సాగుతున్నాయి. ఇలాంటి వాటిపై మమతా బెనర్జీ పోరాడడం లేదు. తన పాలనలో మహిళలను సురక్షితంగా ఉన్నారని ధైర్యంగా చెప్పలేక పోతున్నారు. అంటే మహిళలకు అధికారం అప్పగించినా దానిని సరిగా వినియోగించడం లేదని సగటు మహిళ అర్థం చేసుకోవాలి. ఎంత ఎదిగినా పురుషాధిక్యం పోవడం లేదు. ఎందుకనే కారణాలను వెతకాలి. వాటిపై పోరాడాలి. స్త్రీలను మళ్లీ ఇంటికే, వంటింటికే పరిమితం చేసే ఆలోచన నుంచి బయటపటడం లేదు. లైంగిక దాడులకు గురిచేస్తున్నారు. రక్షణ కరువైన సమాజంలో బతుకుతున్నారు. ఇటువంటి నేపథ్యంలో అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం ఐద్వా అఖిల భారత మహాసభలు ఈ నెల 25 నుండి పోరాటాల గడ్డ తెలంగాణలో జరగబోతున్నాయి. తన భవిష్యత్ కర్తవ్యాలు రూపొందించుకోబోతున్న ఈ సభల సందర్భంగా ఐద్వా ఆత్మవిమర్శ చేసుకోవాలి. ఎంతసేపు మనువాదం అంటూ తిట్టి పోసుకోవడం మానాలి. అసలు మనువాదం అంటే ఈ సమాజానికి తెలియదు. తెలిసిందల్లా ఆడవాళ్లను అణచివేయడం. దీనిపై ఐద్వా చర్చించాలి. అన్నింటికన్నా ముందు.. మహిళలను ఐద్వా గొడుగు కిందకు తీసుకుని వచ్చి ఉద్యమించాలి.ఇదేదో లెఫ్ట్ పార్టీల మహిళా సంఘం అన్న భావన నుంచి బయటపడేయాలి. హైదరాబాద్ నగరంలో ఐద్వా ఆలిండియా మహాసభలు జరగబోతున్న వేళ...ప్రస్తుత సమాజం ఎదుర్కొంటున్న సమస్యలు చర్చించాలి. అంటే మహిళా సమాజం ఎదుర్కొంటున్న సమయలను చర్చించాలి. ప్రస్తుత పరిస్థితుల్లో ఈ మహాసభలకు అత్యంత ప్రాధాన్యం వుంది. ఇప్పుడు మహిళా లోకానికి చాలా అవసరమైన సూచనలు, సలహాలు చేయాల్సిన అవసరం ఐద్వాపై ఎక్కువగా ఉంది. మహిళల్లోనూ కలువివక్ష ఉంది. వర్ణ వివక్ష ఉంది. మహిళలంతా ఒక్కటే అన్న భావన నేటికీ రాలేదు. అందుకే మహిళల గొంతు ఇంకా బలంగా వినిపించాల్సిన అవసరం ఎంతో ఉంది. ఇంట్లోనే కాదు సమాజంలో కూడా కలసికట్టుగా నినదించే స్థాయికి రావాలి. అంతా కలిసి ఐక్యంగా ఉండేందుకు అవగాహన పెంచుకోవడమే కాకుండా, సమస్యలపై పోరాడే శక్తి ఉందని నిరూపించాలి. ఈ మహాసభలు అలాంటి ఉత్సాహాన్ని ఇస్తాయని సగటు మహిళకు ధైర్యం ఇచ్చేలా చేయాలి. ఎందుకంటే దేశ వ్యాప్తంగా అనేక అంశాలపై ఎన్నో పోరాటాలు చేసిన చరిత్ర ఐద్వాకు ఉంది. అసంఘటిత రంగంలో స్త్రీలు ఎదుర్కొంటున్న సమస్యలపై అనేక పోరాటాలు చేశారు. అవన్నీ ప్రేరణగా ముందుకు సాగాల్సిన గురుతర బాధ్యత ఐద్వా మీద ఉంది. ఎందుకంటే సోషల్ మీడియా పెరిగిన తర్వాత మహిళల హక్కులు దుర్వినియోగం అవుతున్నాయి. ఇటువంటి పరిస్థితుల్లో ఐద్వా బాధ్యత తీసుకోవాలి. మహిళలను అశ్లీలంగా చూపే సినిమా సన్నివేశాలపై పోరాడాలి. సోషల్ మీడియాలో స్త్రీ వ్యక్తిత్వ హననం జరగకుండా నిలబడాలి. సమస్య ఏదైనా ఐద్వా పోరాడుతుందన్న సందేశం రావాలి. ఎందుకంటే వివిధ రంగాల్లో ఉన్న మహిళలు అనేక సమస్యలు ఎదుర్కొంటున్నారు. తమ తరపున మాట్లాడే వాళ్లు లేక చాలా మంది మహిళలు ఒంటరిగా బాధపడుతున్నారు. అలాంటి వారికి ఐద్వా గొంతుక కావాలి. ఎంత పురోగతి సాధించినా మహిళలంటే సమాజంలో చిన్నచూపు ఉంది. ముఖ్యంగా కుటుంబ వ్యవస్థలో మార్పు రావాల్సిన అవరసం ఉంది. అలాగే నేడు కులాలు, మతాల పేర మనుషులను చీల్చుతున్నారు. అందులో మహిళలు ఎక్కువగా బలైపోతున్నారు. కనుక ప్రస్తుత పరిస్థితుల్లో ఐద్వా కృషి మరింత పెరగాల్సిన అవసరం ఉంది. తెలంగాణ సాయుధ పోరాటంలో ఎంతో మంది రైతు మహిళలు తుపాకీ చేతబట్టి పోరాడటమే గాకుండా, అలనాటి వర్గ పోరాటాల్లో ముందు నిలిచిన వీరనారి ఐలమ్మలను కన్న నేల ఇది. సమాజం విముక్తితోనే స్త్రీ విముక్తి ముడిబడి ఉందన్న లక్ష్యం రావాలి. మహిళను ఇంకా వంటిమనిషిగా, విలాసవస్తువుగా చూసే దౌర్భాగ్యం పోవాలంటే ఐద్వా పోరాటాలు మరింత పదునుదేలాలి. 33 శాతం మహిళ రాజకీయ రిజర్వేషన్లు హక్కుగా తక్షణం అమల్లోకి వచ్చేలా పోరాడాలి. పార్లమెంటులో మహిళల ప్రాతినిధ్యం, ప్రాధాన్యం పెరగాలి. అందుకోసం పోరాటం చేయాలి. కేవలం చదువుకున్న కార్పోరేట్ మహిళలకు అధికారం వస్తే సరికాదు...నిమ్న, బడుగు బలహీన వర్గాల మహిళల చేతికి అధికారం దక్కాలి. సామాజిక న్యాయ పోరాటాంలోనూ మహిళల ఐక్యతను బలంగా చాటాలి. స్త్రీని వంటగదికి, సంతాన ఉత్పత్తికి, పురుషునికి సేవ చేసే సేవకురాలిగా పరిమితం చేయాలని చూస్తున్న ఈ సమాజంపై తిరుగుబాటు రావాలి. అభ్యుదయ ఆలోచనలతో ప్రజా ఉద్యమాలు నిర్మించవలసిన అవసరం ఉన్నదని గుర్తించి ఐద్వా విస్తృతంగా తన పరిధిని పెంచుకుని ప్రతి మహిళకు గొడుగు కావాలని ఆశిద్దాం.

# తిరుమలలో రథసప్తమికి భారీగా ఏర్పాట్లు

- భక్తుల భద్రతకు టిటిడి పెద్దపీట
- ఎఐ టెక్నాలజీతో పర్యవేక్షణ
- రోజంతా 14 రకాల ప్రాసాదాల వితరణ




**తిరుమల,జనవరి23(పద్మక్రాంతి):** తిరుమల వేంకటేశ్వరస్వామి ఆలయంలో నిర్వహించే రథసప్తమి పర్వదినాన్ని పురస్కరించుకుని టిటిడి భారీగా ఏర్పాట్లు చేస్తోంది. ఇందుకోసం అన్ని ఏర్పాట్లు పూర్తయ్యాయని టీటీడీ అదనపు ఈవో వెంకయ్య చౌదరి తెలిపారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ఈ ఏడాది ప్రత్యేక చర్యలు చేపట్టామని వెల్లడించారు. ప్రత్యేకంగా ఈ ఏడాది తొలిసారిగా ఏఐ టెక్నాలజీని వినియోగించి క్రౌడ్ మేనేజ్మెంట్ వ్యవస్థ ద్వారా పర్యవేక్షిస్తున్నట్లు తెలిపారు. భక్తుల రద్దీని ఎప్పటికప్పుడు విశ్లేషించి, అవసరమైన చోట తక్షణ చర్యలు తీసుకునేలా ఈ వ్యవస్థ ఉపయోగపడు తుందని పేర్కొన్నారు.గతేడాది రథసప్తమి సందర్భంగా భక్తులు ఇచ్చిన సూచనలను పరిగణనలోకి తీసుకుని, ఆలయ మాడ వీధుల్లోని గ్యాలరీల్లో షెడ్లు ఏర్పాటు చేశామని వెంకయ్య చౌదరి తెలిపారు. దీని ద్వారా వాహన సేవలను తిలకించేందుకు వచ్చే భక్తులు ఎండ, వర్షాల నుంచి రక్షణ పొందుతారని పేర్కొన్నారు. రథసప్తమి రోజున వాహన సేవలను దర్శించుకునేందుకు వచ్చే భక్తులకు ఉదయం నుంచి రాత్రి వరకు నిరంతరాయంగా 14 రకాల ప్రసాదాలను పంపిణీ చేయనున్నట్లు టీటీడీ వెల్లడించింది. ప్రసాదాల సరఫరాలో ఎలాంటి లోటు లేకుండా ముందస్తుగా అన్ని ఏర్పాట్లు చేసినట్లు అడిషనల్ ఈఓ తెలిపారు. భక్తుల అవసరాలను దృష్టిలో ఉంచుకుని 9 లక్షల లడ్డూలను ముందుగానే నిల్వ ఉంచామని వెంకయ్య చౌదరి చెపారు. లడ్డూల విక్రయంలోనూ భక్తులకు ఇబ్బందులు లేకుండా ప్రత్యేక కౌంటర్లు, సిబ్బందిని నియమించామన్నారు. రథసప్తమి పర్వదినాన లక్షల సంఖ్యలో భక్తులు తరలివచ్చే అవకాశమున్న నేపథ్యంలో, భక్తులకు త్వరితగతిన మూల విరాట్టు(వేంకటేశ్వర స్వామి) దర్శనం కల్పించేందుకు ప్రత్యేక ఏర్పాట్లు చేసినట్లు వెంకయ్య చౌదరి ప్రకటించారు. దర్శన క్యూలైన్లను సమర్థవంతంగా నిర్వహించేందుకు అదనపు సిబ్బందిని నియమించినట్లు తెలిపారు. భక్తుల భద్రతకు అత్యంత ప్రాధాన్యత ఇస్తున్నామని అదనపు ఈఓ వివరించారు. 400 మంది టీటీడీ సిబ్బందిని, డిప్యుటేషన్‌పై మరో 2400 మంది భద్రతా సిబ్బందితో పటిష్ఠ బందోబస్తు ఏర్పాటు చేసినట్లు వెంకయ్య చౌదరి తెలిపారు. పోలీస్, విజిలెన్స్, టీటీడీ సిబ్బంది సమన్వయంతో భద్రతా చర్యలు అమలు చేస్తున్నట్లు వెల్లడించారు. రథసప్తమి రోజున భక్తులు టీటీడీ సూచనలు పాటించాలని సూచించారు. భక్తులు క్రమశిక్షణతో వ్యవహరించాలని అదనపు ఈవో కోరారు. భక్తుల సహకారంతో దర్శనాలు సాఫీగా జరుగుతాయని టీటీడీ అదనపు ఈవో వెంకయ్య చౌదరి పేర్కొన్నారు.

# తళుకులీనుతున్న మేడారం



- నిరంతర విద్యుత్ సౌకర్యం ఏర్పాటు
- ప్రత్యేక ఫీడర్ ఏర్పటుతో పర్యవేక్షణ

**ములుగు,జనవరి23(పద్మక్రాంతి):** నిరంతర విద్యుత్ కాంతులతో మేడారం తళుకులీనుతోంది. ప్రత్యేక ఏర్పాట్లతో రెప్పపాటు విద్యతు పోకుండా చర్యలు తీసుకున్నారు. మేడారం జాతరలో ఎలాంటి అంతరాయం లేకుండా నిరంతరం విద్యుత్ అందించేందుకు రూ.5కోట్ల నిధులతో ఎన్పీడీసీఎల్ యాజమాన్యం ఏర్పాట్లు పూర్తిచేసింది. ఈనెల 28నుంచి మేడారం జాతర ప్రారంభం కానున్న నేపథ్యంలో జాతర పరసరాల్లో ఎటు చూసినా విద్యుత్ కాంతులు జిగేల్ అంటున్నాయి. జాతరను సక్సెస్ చేసేందుకు ప్రత్యేక బృందాలు రంగంలోకి దిగి ఐదు రోజులు నిర్విరామంగా విధులు నిర్వహించేందుకు సిద్ధమవుతున్నాయి. విద్యుత్ అంతరాయాలు ఏర్పడితే సత్వరమే పునరుద్ధరించేందుకు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేశారు. జాతర పరిసరాల్లో ఎలాంటి అంతరాయలు లేకుండా ముందస్తుగా నివారించడంతోపాటు అనుకోకుండా అంతరాయం ఏర్పడితే సత్వరమే పునరుద్ధరణ చర్యలు చేపట్టేందుకు 50 బృందాలను సిద్ధం చేశారు. కాగా, కొత్తగా ఏర్పాటు చేసిన నార్లాపూర్ సబ్‌స్టేషన్ నుంచి పార్కింగ్ కేంద్రాలకు, పరిసర ప్రాంతాల్లోని దుకాణాలకు, గ్రామాలకు విద్యుత్ సరఫరా చేసేందుకు ఏర్పాట్లు చేశారు.జాతర పరిధిలో 193 ట్రాన్స్‌ఫార్మర్లను ఏర్పాటు చేయగా, కొత్తగా నార్లాపూర్‌లో రూ.2.50 కోట్లతో 33/11కేవీ సబ్‌స్టేషన్‌ను నిర్మించారు. వీటి ని రన్ చేసేందుకు ఆపరేషన్, ప్రాజెక్టు డైరెక్టర్ల ఆధ్వర్యంలో ఇద్దరు సీజీఎంలు, ఏడుగురు డీఈలు, 20 మంది ఏడీఈ లు, 150మంది ఇంజనీర్లు, మెంటెనెన్స్ సిబ్బంది కలిపి 350 మంది వరకు విధుల్లో నిమగ్నం కాబోతున్నట్లు ఎన్పీడీసీఎల్ యాజమాన్యం వెల్లడించింది. నాలుగు ట్రాన్స్‌ఫార్మర్లకు ఒక బృందం చొప్పున పర్యవేక్షించనుంది. 33 కేవీ లైన్స్ పర్యవేక్షణకు తాడ్వాయి, పస్రా, గోవిందరావుపేట, చెల్పూర్, ఏటూరునాగారం, కమలాపూర్, ములుగు సబ్‌స్టేషన్‌ల పరిధిలో పెట్రోలింగ్ నిర్వహిస్తున్నామని, ఇవే ప్రాంతాల్లోని ఈహెచ్‌టీ సబ్‌స్టేషన్‌ల వద్ద విద్యుత్ సరఫరా పర్యవేక్షించేందుకు 20 మంది ఇంజనీర్లు, ఆపరేషన్ సిబ్బందిని ప్రత్యేకంగా ఏర్పాటు చేశామన్నారు. అత్యవసర పనుల కోసం సామగ్రిని తరలించేందు కు 30 వాహనాలను కేటాయించారు. విద్యుత్ వోల్టేజీ, ఫీడర్ లోడ్, అంతరాయాలను ఎప్పటికప్పుడు తెలుసుకునేందుకు హనుమకొండలోని ఎన్పీడీసీఎల్ కార్పొరేట్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన స్కాడా ద్వారా పర్యవేక్షించనున్నారు. దీనికోసం ఇప్పటికే మేడారంలోని రెండు 33/11 కేవీ సబ్‌స్టేషన్‌లలో రియల్ టైం ఫీడర్ మేనేజింగ్ సిస్టంను ఏర్పాటు చేశారు. విద్యుత్ ప్రమాదాలు జరగకుండా, వ్యాపారులు విద్యుత్ వైర్లకు కొక్కిలు వేయకుండా మేడారం, సమ్మక్క, సారక్క సబ్‌స్టేషన్ల పరిధిలో 26 కిలోమీటర్ల మేర 11కేవీ లైన్స్, 15 కిలోమీటర్ల మేర 33కేవీ లైన్స్‌కు ఓపెన్ కండక్టర్ స్థానంలో కవర్డ్ కండక్టర్‌లు ఏర్పాటు చేశారు. ÷ుద్యుత్ ప్రమాదాల నిరోధానికి ఎల్‌టీ లైన్‌ల మధ్య స్పేసర్స్ ఏర్పాటు చేశారు. మేడారం, నార్లాపూర్, కొత్తూర్‌లోని సబ్‌స్టేషన్‌లను పస్రా 132/33 కేవీ సబ్‌స్టేషన్‌కు అనుసంధానం చేశారు. ప్రత్యామ్నాయం కోసం ములుగు

# మళ్లీ భగ్గుమన్న బంగారం ధరలు

## ఒక్కరోజులోనే ఐదవేలు పెరిగిన రేటు

**న్యూఢిల్లీ,జనవరి23(పద్మక్రాంతి):** తగ్గినట్లే తగ్గిన బంగారం ధర మళ్లీ పెరిగింది. రోజురోజుకూ కొత్త గరిష్టాలకు ధరలు ఎగబాకుతున్నాయి. గ్రీన్‌లాండ్‌పై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ స్వరం మారిన వేళ తగ్గుముఖం పట్టిన పసిడి ధర మళ్లీ పైకెగిసింది. డెన్మార్క్ అధీనంలోని ద్వీపాన్ని బలప్రయోగం ద్వారా స్వాధీనం చేసుకోబోమని ట్రంప్ ప్రకటించడంతో.. గురువారం బంగారంలో లాభాల స్వీకరణ కనిపించింది. అయితే, అది ఒక్క రోజుకే పరిమితమైంది. ఇరాన్ చుట్టూ అమెరికా బలగాలు మోహరించడంతో మరోసారి అంతర్జాతీయంగా ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. దీంతో సురక్షిత పెట్టుబడి సాధనంగా భావించి మదుపర్లు బంగారం వైపు పెట్టుబడులను మళ్లిస్తున్నారు. బంగారానికి పెరిగిన డిమాండ్ కారణంగా మళ్లీ దీని ధర పెరిగింది. అంతర్జాతీయ విపణిలో బంగారం ధర ఔన్సు 5 వేల డాలర్లకు చేరువైంది. ప్రస్తుతం 4,945 డాలర్ల వద్ద కొనసాగుతోంది. దీన్ని అనుసరించి దేశీయంగా బంగారం ధరలు మళ్లీ పెరిగాయి. మధ్యాహ్నం ఒంటి గంట సమయంలో హైదరాబాద్ బులియన్ మార్కెట్‌లో 10 గ్రాముల మేలిమి పసిడి రూ.1,59,954 పలుకుతోంది. గురువారంతో పోలిస్తే ఒక్క రోజులోనే పసిడి రూ.5వేలు పెరిగింది. 22 క్యారెట్ల బంగారం ధర రూ.1.41 లక్షలుగా ఉంది. మరోవైపు అంతర్జాతీయ మార్కెట్‌లో వెండి ఔన్సు 98 డాలర్ల వద్ద కొనసాగుతుండగా.. హైదరాబాద్‌లో కిలో వెండి రూ.3.25 లక్షలుగా ఉందని బులియన్ వర్గాలు పేర్కొంటున్నాయి.

# సీమ ఎత్తిపోతలతోనే సమస్యకు పరిష్కారం

- శాశ్వత నీటి సౌకర్యం కల్పించాలన్న డిమాండ్

**తిరుపతి,జనవరి23 (పద్మక్రాంతి):** రాయలసీమకు నీటి హక్కు కల్పించాలనే సంకల్పంతో సాగిన పోతిరెడ్డిపాడు పాదయాత్రకు 40 సంవత్సరాలు పూర్తయ్యాయి. ఈ సందర్భంగా రాయలసీమకు శాశ్వత నీటి సౌకర్యం కల్పించాలని ÷ూయలసీమ ఎత్తిపోతల పథక సాధన సమితి డిమాండ్ చేసింది. ఇందుకోసం రాయలసీమ ఎత్తిపోతల సాధన సమితిని ఏర్పాటు చేసి, రాయలసీమ అవసరాల కోసం హక్కుగా అందాల్సిన నీటిని సాధించే దిశగా ఉద్యమించాలని నిర్ణయించింది. రాయలసీమ నీటి సమస్యలపై ప్రజల్లో అవగాహన పెంపొందించడం, భవిష్యత్తు విధానాలపై సార్థకమైన చర్చకు వేదిక కల్పించాలని తదితర అంశాలను ఇటీవలి సమావేశంలో ఆమోదించారు. 40 ఏళ్ల అనుభవాన్ని దృష్టిలో పెట్టుకుని ఇటీవల తిరుపతిలో చర్చాగోష్టి నిర్వహించారు. ఈ గోష్టిలో పలు రాజకీయపార్టీలకు చెందిన నాయకులు, సామాజిక మేధావులు తమ అభిప్రాయాలను వెల్లడించారు. రాయలసీమ ఎత్తిపోతల పథకం నిలుపుదలపై కేంద్ర ప్రభుత్వం ఎందుకు నోరు మెదపడం లేదని ప్రశ్నించారు. రాయలసీమ డిక్లరేషన్‌పై బిజెపి మౌనం వహించడం వల్ల తీవ్ర అన్యాయం జరుగుతోందన్నారు. 2023లో తాగునీటి అవసరాల కోసం జగన్ హయాంలో రూ.3285 కోట్లు అంచనా వ్యయంతో పనులు ప్రారంభిస్తే ఇందులో రూ.1000 కోట్లు ఖర్చు చేశారని, కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో రాయలసీమ ఎత్తిపోతల పథకం నిలిపివేసిందన్నారు. రాయలసీమ ఎత్తిపోతల పథకంపై సిఎం చంద్రబాబు నాయుడు ప్రజలకు సమాధానం చెప్పాలని, దీనిపై తెలంగాణ ప్రభుత్వంతో చర్చించి రాయలసీమకు మేలు జరిగే విధంగా నిర్ణయం తీసుకోవాలని డిమాండ్ చేశారు.

# సరస్వతీ ఆలయాల్లో ప్రత్యేక పూజలు

- బాసర, వర్గల్‌లో జోరుగా అక్షరాభ్యాసాలు
- ప్రత్యేక పూజలు చేపట్టిన భక్తులు




**నిర్మల్,జనవరి23 (పద్మక్రాంతి):** దేశవ్యాప్తంగా వసంత పంచమి వేడుకలను భక్తులు ఉత్సాహంగా జరుపుకున్నారు. విద్య, జ్ఞానం, వాక్చాతుర్యానికి దేవతగా పరిగణించే సరస్వతి దేవికి అంకితం చేయబడింది. జ్ఞానం, విద్య, కళలలో విజయం కోరుతూ ప్రజలు సరస్వతి దేవిని పూజిస్తారు. విద్యార్థులు, ఉపాధ్యాయులు, సృజనాత్మక రంగాలలో ఉన్నవారికి చాలా ముఖ్యమైనది. మారుతున్న ఋతువుల ప్రారంభం, వసంతకాలం ఆగమనాన్ని సూచిస్తుంది. వసంత పంచమి నాడు సరస్వతి దేవిని భక్తగా పూజించడం వల్ల చదువుపై దృష్టి పెట్టడానికి, జీవితంలో సానుకూల మార్పులు వస్తాయని నమ్ముతారు. దీంతో పలు ఆలయాల్లో ముఖ్యంగా అమ్మవారి ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. తెలంగాణలోని బాసర,వర్గల్, ఓయూ క్యాంపస్ తదితర సరస్వతీ ఆలయాల్లో విద్యార్థుల సందడి కనిపించింది. అక్షరాభ్యాసాలకు చిన్నారులు తరలివచ్చారు. నిర్మల్ జిల్లాలోని బాసర శ్రీ జ్ఞానసరస్వతి అమ్మవారి ఆలయంలో వసంత పంచమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. బాసర పుణ్యక్షేత్రం. భక్తుల తో కిక్కిరిసిపోయింది. వసంత పంచమి సందర్భంగా అమ్మవార్ల కు ప్రత్యేక పూజలు నిర్వహించారు. తెల్లవారు జామునుంచే ప్రత్యేక అక్షరాభ్యాసం, కుంకుమార్చన పూజలు మొదలయ్యాయి. వేకువ జామునుంచే భక్తుల రద్దీ కొనసాగుతోంది. గోదావరిలో పుణ్యస్నానాలు ఆచరించి అమ్మవారిని దర్శించుకున్నారు. వివిధ రాష్ట్రాల నుంచి భారీ సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. అర్ధరాత్రి నుంచి చదువుల తల్లి దర్శనం కోసం భక్తులు వేచి ఉన్నారు. చిన్నారుల అక్షర శ్రీకార పూజలు.. గోదావరి నదిలో భక్తుల పుణ్య స్నానాలు కొనసాగాయి. వసంత పంచమిని పిల్లలకు పాఠశాల విద్య ప్రారంభించడానికి శుభప్రదంగా భావిస్తారు. ఈ రోజున చిన్న పిల్లలకు మొదటిసారి రాయడం నేర్పించడం లేదా విద్యకు సంబంధించిన ఏదైనా కొత్త అడుగు వేయడం శుభప్రదంగా భావిస్తారు. ఈ రోజున పేద పిల్లలకు పుస్తకాలు, నోట్‌బుక్‌లు లేదా పెన్నులు దానం చేయడం కూడా పుణ్యప్రదంగా పరిగణిస్తారు. ఈ క్రమంలో అమ్మవారి ఆలయంలో పెద్ద ఎత్తున అక్షరాభ్యాసాలు సాగాయి.

# నేతాజీ ప్రాతఃస్మరణీయుడు

- నివాళి అర్పించిన చంద్రబాబు, లోకేశ్

**అమరావతి,జనవరి23(పద్మక్రాంతి):** నేతాజీ సుభాష్ చంద్రబోస్ 129వ జయంతి సందర్భంగా ఏపీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు , విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్ ఘన నివాళులు అర్పించారు. నేతాజీ పోరాట పటిమ దేశ పౌరుషానికి ప్రతీకగా నేటికీ చెప్పుకుంటున్నామని, స్వాతంత్యం÷-ర కోసం అవిశ్రాంతంగా పోరాడిన యోధుడు నేతాజీ అంటూ ఎక్స్‌లో సీఎం, మంత్రి పోస్టు చేశారు.

'ఆజాద్ హింద్ ఫౌజ్' ఏర్పాటు చేసి భరత మాత దాస్య శృంఖలాలను తెంచేందుకు నిర్విరామ కృషి చేసిన మహనీయుడు నేతాజీ సుభాష్ చంద్రబోస్. ఆయన 129వ జయంతి సందర్భంగా ఘన నివాళి అర్పిస్తున్నాను. ఆయన పోరాట పటిమ దేశ పౌరుషానికి ప్రతీకగా ఈనాటికీ చెప్పుకుంటున్నామంటే అది ఆయన ప్రత్యేకత. భారత జాతి కోసం ప్రాణాలకు తెగించి పోరాడతానని ప్రతిజ్ఞ చేసి కార్యాచరణలో చూపిన నేతాజీ సుభాష్ చంద్రబోస్ మనకు ప్రాత:స్మరణీయుడు' అని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ట్వీట్ చేశారు. నేతాజీ సేవలను స్మరించుకుంటూ ఘన నివాళులు అర్పించారు మంత్రి నారా లోకేశ్. 'ఆజాద్ హింద్ ఫౌజ్‌ను స్థాపించి భారతదేశ స్వాతంత్ర్యం కోసం అవిశ్రాంతంగా పోరాడిన యోధుడు నేతాజీ సుభాష్ చంద్రబోస్. ఆయన జయంతి సందర్భంగా ఆ మహనీయుని సేవలను స్మరించుకుంటూ ఘన నివాళులు అర్పిస్తున్నాను' అంటూ మంత్రి నారా లోకేశ్ సోషల్ మీడియా ఎక్స్‌లో పోస్టు చేశారు.

శనివారం, జనవరి 24, 2026

RNI No : TELTEL/2022/85167
పద్మక్రాంతి
(వాస్తవాలు వెలుగులోకి)
తెలుగు దినపత్రిక

# ఇంకెన్నాళ్లీ డైవర్షన్ పాలిటిక్స్

ఉడత బెదిరింపులకు భయపడేది లేదని హరీశ్‌రావు హెచ్చరించారు. ధైర్యం ఉంటే సిట్ విచారణ వీడియో బయటపెట్టాలని సవాల్ విసిరారు. లీకులతో ప్రభుత్వాన్ని ఎంతకాలం నడుపుతారని ప్రశ్నించారు. సీఎం రేవంత్‌రెడ్డి వ్యక్తిత్వ హననానికి పాల్పడుతున్నారని హరీశ్‌రావు ధ్వజమెత్తారు. సిట్.. పొట్టు.. లట్టుకి భయపడేది లేదని ఎద్దేవా చేశారు. మీ అవినీతిని బయటపెట్టే వరకు ఊరుకునేది లేదని హెచ్చరించారు. సింగరేణిలో సోలార్ పవర్ స్కాం బయటపడిందని ఆరోపించారు. నాడు సింగరేణి సిరుల గనిగా ఉండేదని తెలిపారు. నేడు సింగరేణి సృజన్ గనిగా మారిందని విమర్శలు చేశారు. మంత్రుల మధ్య వాటాల పంచాయతీ నడుస్తోందని ఆరోపించారు. మంత్రుల పంచాయతీ కాంగ్రెస్‌కు ఉరితాడులా మారిందని ఆక్షేపించారు. సృజన్ వ్యవహారం బయటపెట్టిన తర్వాత.. కాంగ్రెస్ ప్రభుత్వానికి కంటిమీద కునుకు లేదని విమర్శించారు. అవినీతిని కప్పిపుచ్చుకునేందుకే సిట్ నోటీసుల పేరుతో డ్రామాలు ఆడుతున్నారని హరీశ్‌రావు ఆగ్రహించారు. సిట్ విచారణపై తప్పుడు ప్రచారం చేస్తున్నారని ఫైర్ అయ్యారు. లోపల ఏదో జరుగుతోందని తప్పుడు లీకులు ఇస్తున్నారని ఆరోపించారు. లీకులతో వ్యక్తిత్వ హననానికి పాల్పడుతున్నారని ధ్వజమెత్తారు. కట్టుకథలతో ఇంకెన్నాళ్లు ప్రభుత్వాన్ని నడుపుతారని నిలదీశారు. సీఎం రేవంత్‌రెడ్డి బంధువు భూ కుంభకోణాన్ని ఆధారాలతో సహా బయటపెట్టామని మాజీ మంత్రి హరీశ్ రావు అన్నారు. ఆధారాలతో సహా బయటపెట్టేసరికి ప్రభుత్వానికి కంటిమీద కునుకు లేకుండా అయ్యిందని ఎద్దేవా చేశారు. కుంభకోణం ఎలా బయటకు వచ్చిందని వారంతా తలలు పట్టుకుంటున్నారని తెలిపారు. సింగరేణిలో 107 మెగావాట్ల సోలార్ పవర్ ప్లాంట్‌లో పెద్ద కుంభకోణం జరిగింది. ఎంఎస్ఎంఈలు పాల్గొనకూడదని మూడింటికి కలిపి ఒకేసారి టెండర్లు పిలిచారు. సోలార్ పవర్ టెండర్ అనుమతులు కఠినం చేశారు. ప్రభుత్వం అనుకున్న వారికి టెండర్లు కట్టబెట్టేందుకు నిబంధనలు మార్చారు. దేశ వ్యాప్తంగా ఒక మెగావాట్ సోలార్ పవర్ ఉత్పత్తికి రూ.3కోట్లు అవుతుంది. రాష్ట్రంలో మాత్రం ఒక మెగావాట్ సోలార్ ఉత్పత్తికి రూ.5.04 కోట్లు ఇచ్చారు. అదనంగా సింగరేణి భూములు కూడా ఇచ్చారు. సింగరేణిలో సోలార్ పవర్ ఉత్పత్తికి రూ.214 కోట్లు అదనంగా చెల్లించారు. సింగరేణిలో మరో సోలార్ పవర్‌ప్లాంట్‌లోనూ స్కామ్ చేశారు. బొగ్గు కుంభకోణాన్ని బీఆర్ఎస్ బయటపెట్టిన తర్వాతే కిషన్‌రెడ్డి సమీక్ష చేస్తున్నారన్నారు.

# వ్యవసాయం ఓ విజ్ఞానం

విద్యాలయానికి శంకుస్థాపన చేయడమే కాక, మట్టపల్లి లక్ష్మీ నరసింహ స్వామి దేవాలయంలో కోటి రూపాయల వ్యయంతో నిర్మించనున్న యాత్రికా సదన్, నూతన కిచెన్ షెడ్ కు, మరో కోటి రూపాయల వ్యయంతో నిర్మించే డార్మెటరీ బిల్డింగులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో రాష్ట్ర గవర్నర్ మాట్లాడుతూ వసంత పంచమి రోజున పవిత్ర కృష్ణానది తీరాన ఉన్న మట్టపల్లి శ్రీ లక్ష్మీనరసింహ స్వామిని దర్శించుకోవడం సంతోషమని అన్నారు. అలాగే రైతులకు ఉపయోగపడే వ్యవసాయ కళాశాలకు, విద్యార్థులకు ఉపయోగపడే నవోదయ పాఠశాల నిర్మాణానికి శంకుస్థాపన చేయడం ఎంతో సంతోషంగా ఉందని తెలిపారు. 'వ్యవసాయం ఒక విజ్ఞానమని', ఇంతకు పూర్వం దేశంలో జై జవాన్, జై కిసాన్, నినాదం ఉండేదని, ఆ తర్వాత జై జవాన్, జై కిసాన్, జై విజ్ఞాన్ నినాదం వచ్చిందని,ప్రస్తుతం ఇది జై జవాన్ ,జై కిసాన్, జై విజ్ఞాన్, జై అనుసంధాన్ గా మారిందని తెలిపారు. గంగ ,యమునా, సరస్వతి లాగే కృష్ణ, గోదావరి, కావేరి నదులు ఉండడం, మట్టపల్లిలో స్వయంభు లక్ష్మీనరసింహస్వామి దేవాలయం ఉండడం ఇక్కడి ప్రజల అదృష్టమని అన్నారు. జిల్లాలో పెద్ద ఎత్తున వ్యవసాయం సాగు చేయడం, ప్రత్యేకించి పామాయిల్ పెంపకం చేపట్టడం అభినందనీయం అన్నారు. ఈ సందర్భంగా రాష్ట్ర గవర్నర్ రైతులకు రెండు కోట్ల 47 లక్షల రూపాయల విలువ చేసే వ్యవసాయ యంత్ర పరికరాల ప్రోసీడింగ్స్ ను అందజేశారు. అంతేకాక స్వయం సహాయక మహిళా సంఘాలకు బ్యాంకు లింకేజీ కింద 504 కోట్లు, ఆదాయ వనరుల ను పెంపొందించేందుకు మరో 89 కోట్ల రూపాయల చెక్కులను అందజేశారు. రాష్ట్ర నీటిపారుదల, పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తంకుమార్ రెడ్డి మాట్లాడుతూ స్వతంత్ర భారతదేశంలో ఏ రాష్ట్రంలో పండించని విధంగా తెలంగాణ రాష్ట్రంలో అత్యధికంగా వరి ధాన్యాన్ని పండిస్తున్నామని, దేశంలో ఎక్కడా లేనివిధంగా 85శాతం మందికి ఉచితంగా సన్న బియ్యం ఇస్తున్నామని తెలిపారు. మట్టపల్లి అభివృద్ధికి తన వంతు శాయ శక్తుల ఇదివరకే కృషి చేశానని, భవిష్యత్తులో మరింత అభివృద్ధి చేసేందుకు చర్యలు తీసుకుంటానన్నారు. హుజూర్నగర్ నుండి మట్టపల్లి వరకు 80 కోట్ల రూపాయలతో డబుల్ రోడ్డు మంజూరు చేశామని, గతంలో 50 కోట్ల రూపాయలతో బ్రిడ్జి నిర్మించామని చెప్పారు. కృష్ణ ,గోదావరి జిల్లాలో ఒక చుక్క నీటిని కూడా వదులుకోమని, కృష్ణ,గోదావరి జలాల హక్కులు కాపాడుకునేందుకు ఏ పోరాటానికైనా సిద్ధంగా ఉన్నట్లు ఆయన వెల్లడించారు. హుజూర్నగర్, కోదాడ ప్రజల జీవితాల్లో వెలుగు నింపడమే తన లక్ష్యమన్నారు. రాష్ట్ర గవర్నర్ చేతుల మీదుగా 150 కోట్ల రూపాయలతో వ్యవసాయ కళాశాల, 50 కోట్ల రూపాయలతో కోదాడ సమీపంలో జవహర్ నవోదయ విద్యాలయ నిర్మాణానికి శంకుస్థాపన చేయడం సంతోషమని అన్నారు. రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర మాట్లాడుతూ రానున్న రోజుల్లో ఐటీ ,ఏఐ కన్నా వ్యవసాయ రంగమే ముందుంటుందని, సాఫ్ట్ వెర్, ఐటి సెక్టార్ ల నుండి వచ్చి వ్యవసాయ రంగంలో పనిచేసే రోజులు వస్తాయని అన్నారు. తెలంగాణ దేశానికే వరి అందించే ఏకైక రాష్ట్రం గా మారిందని, వ్యవసాయ రంగానికి ఇస్తున్న ప్రాధాన్యతలో భాగంగా వ్యవసాయ కళాశాలలు లేని ఉమ్మడి జిల్లాలలో వ్యవసాయ కళాశాలల ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నామని, ఇందులో భాగంగానే నిజామాబాద్, రంగారెడ్డి జిల్లాలలో వ్యవసాయ కళాశాలలు మంజూరు చేయడం జరిగిందని తెలిపారు. రెండు కోట్ల 50 లక్షల మెట్రిక్ టన్నుల వరి ధాన్యాన్ని పండించి తెలంగాణ రైతులు దేశంలోనే ముందున్నారని, అలాగే ఇతర పంటల విషయంలో సైతం రాష్ట్ర రైతులు ముందు నిలుస్తున్నారని, ప్రత్యేకించి ఆయిల్ పామ్ సాగులో తెలంగాణ ముందు ఉందని, రాబోయే రోజుల్లో తెలంగాణ రాష్ట్రం పామాయిల్ పంటలో దేశంలో ప్రథమ స్థానంలో నిలుస్తుందని, ప్రస్తుతం 10 లక్షల ఎకరాలలో పామాయిల్ తోటలు పండిస్తున్నట్లు తెలిపారు. రాష్ట్రంలో అత్యధికంగా సన్నబియ్యాన్ని సాగు చేయడంతో పాటు, పేద ప్రజలకు ఉచితంగా సన్న బియ్యం ఇస్తున్న ఘనత తమదేనన్నారు. జిల్లా ఇంచార్జ్ మంత్రి ,రాష్ట్ర సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్, వ్యవసాయ విశ్వవిద్యాలయం వైస్ ఛాన్సలర్ అల్తాఫ్ జానయ్య, జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ మాట్లాడారు. మ్మెల్సీ శంకర్ నాయక్ వందన సమర్పణ చేయగా, పార్లమెంట్ సభ్యులు కుందూర్ రఘువీర్ రెడ్డి, శాసనసభ్యులు బత్తుల లక్ష్మారెడ్డి, కుందూర్ జయవీర్ రెడ్డి, కోదాడ శాసన సభ్యురాలు పద్మావతి, వ్యవసాయ శాఖ కార్యదర్శి సురేంద్రమోహన్, జిల్లా ఎస్పీ కే. నరసింహ, జిల్లా అధికారులు, ప్రజాప్రతినిధులు తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

# లీకులను ఎవరూ నమ్మొద్దు..

హైదరాబాద్,జనవరి23(పద్మక్రాంతి): లీకులను ఎవరూ నమ్మొద్దు.. ఇది లీకు వీరుల ప్రభుత్వమని కెటిఆర్ ఎద్దేవా చేశారు. లీకులపై ఆధారపడి ప్రభుత్వం నడిపిస్తున్నారని సెటైర్లు గుప్పించారు. ఫోన్ ట్యాపింగ్ కేసులో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కల్వకుంట్ల తారక రామారావును సిట్ అధికారులు శుక్రవారం విచారణ జరిపారు. ఈ కేసులో కేటీఆర్‌ను అధికారులు పలు ప్రశ్నలు అడిగారు. కేటీఆర్‌ను సుమారుగా 7 గంటలకు పైగా ప్రశ్నించారు. అనంతరం తెలంగాణ భవన్‌కు చేరుకున్న తర్వాత మీడియా సమావేశంలో కేటీఆర్ మాట్లాడారు. సిట్ అధికారులు అడిగిన అన్ని ప్రశ్నలకు సమాధానాలు ఇచ్చానని తెలిపారు. ప్రజల దృష్టి మరల్చేందుకే ఈ డ్రామాలు ఆడుతున్నారని ధ్వజమెత్తారు. విచారణ పేరుతో సీఎం రేవంత్‌రెడ్డి డైవర్షన్ పాలిటిక్స్ చేస్తున్నారని ఆగ్రహించారు. ఫోన్ ట్యాపింగ్ పేరుతో కాలక్షేపం చేస్తున్నారని విమర్శించారు. లీకులతో వ్యక్తిత్వ హననానికి పాల్పడుతున్నారని ఫైర్ అయ్యారు. లీకులతో తమకు సంబంధం లేదని అధికారులు చెబుతున్నారని మాజీ మంత్రి కేటీఆర్ ప్రస్తావించారు. కొంతమంది హీరోయిన్ల ఫోన్లు ట్యాప్ చేసి.. బెదిరించామని బయట ప్రచారం జరుగుతోందని చెప్పుకొచ్చారు. ఇది వాస్తవమా? కాదా? అని సిట్‌ను తాను అడిగానని తెలిపారు. ఆ వార్తలు అవాస్తవమని అధికారులు చెప్పారని స్పష్టం చేశారు. అవాస్తవాలు ప్రచారం చేసే వారిపై చర్యలేవీ అని తాను ప్రశ్నించానని అన్నారు. ఇప్పుడు తమ ఫోన్లు ట్యాప్ కావటం లేదా అని అధికారులను నిలదీశానని తెలిపారు. తన ప్రశ్నలకు సిట్ అధికారులు నీళ్లు నమిలారని విమర్శించారు. అడిగిన ప్రశ్నలే మళ్లీ మళ్లీ అడిగి వేధించారని ధ్వజమెత్తారు. విచారణ పేరుతో వేధించడం తప్ప.. వీళ్లు చేసేదేమీ లేదని ఎద్దేవా చేశారు. సింగరేణి టెండర్లలో దొంగలు దొరికారని ఆరోపణలు చేశారు.పారిశ్రామికవేత్తకు గన్ పెడితే సిట్ ఎందుకు వేయరు..? అని ప్రశ్నల వర్షం కురిపించారు. సీఎం రేవంత్‌రెడ్డి తన మంత్రుల, సన్నిహితుల దోపిడీపై సిట్ వేయరా,,? అని నిలదీశారు. న్యాయం, ధర్మం అందరికీ ఒకేలా ఉండాలని చెప్పుకొచ్చారు. సెలక్టివ్‌గా లీకులు ఇచ్చి తప్పుడు ప్రచారం చేస్తున్నారని దుయ్యబట్టారు. తనను ఎవరితోనూ కలిపి అధికారులు విచారించలేదని చెప్పుకొచ్చారు. ఈ విచారణలో తాను తప్ప మరే రావు లేరని తెలిపారు. తనను విచారణకు మళ్లీ పిలుస్తామని అధికారులు అన్నారని... బాధ్యత గల ప్రతిపక్షంగా ఏ విచారణకైనా సహకరిస్తామని మాజీ మంత్రి కేటీఆర్ స్పష్టం చేశారు.

# టీవీ సీరియల్‌లా సాగుతున్న సిట్ విచారణ

చేసే ధైర్యం ఈ ప్రభుత్వానికి లేదని తేలిపోయిందన్నారు. దేశభద్రత కోసం జరిగే ట్యాపింగ్‌కు..తెలంగాణలో జరిగిన ఫోన్ ట్యాపింగ్‌కు సంబంధమే లేదు.
మావోయిస్టుల పేరుతో హీరోయిన్లు, వ్యాపారులు, రాజకీయ నేతలు, జడ్జీల ఫోన్లు ట్యాప్ చేశారు. సిట్‌లో మంచి అధికారులు ఉన్నారు.. కానీ ప్రభుత్వం వారికి స్వేచ్ఛను ఇవ్వడం లేదన్నారు. ఈ కేసులో ఒక్క రాజకీయ నేతనైనా అరెస్ట్ చేశారా అని ప్రశ్నించారు. మా ప్రభుత్వం అధికారంలో ఉండి ఉంటే కేసీఆర్ కుటుంబ సభ్యులపై చర్యలు చేపట్టేవాళ్లం. తప్పు చేసిన నేతలు, అధికారులను అరెస్ట్ చేయాలని బండి సంజయ్ డిమాండ్ చేశారు. బీఆర్ఎస్ హయాంలో చాలా మంది పారిశ్రామిక వేత్తలను బెదిరించి కోట్లు వసూలు చేశారని ఆరోపించారు. సినిమా హీరోయిన్ల ఫోన్లను ట్యాప్ చేసి లాభపడ్డారని ఆరోపించారు. స్వయంగా తన ఫోన్ ట్యాప్ అయిందని సీఎం,పలువురు మంత్రులే చెప్పారన్నారు.. జడ్జిల ఫోన్లు, ప్రతిపక్ష నేతల ఫోన్లు కూడా ట్యాపింగ్ చేశారని బండి సంజయ్ చెప్పారు. కేసీఆర్ కుటుంబమే ఫోన్ ట్యాపింగ్ కు పాల్పడిందన్నారు బండి సంజయ్. ఎలక్టోర్ బాండ్ల పేరుతో బీఆర్ఎస్ కోట్లు వసూలు చేసిందన్నారు. ఎంత మంది ఆస్తులను జప్తు చేశారో చెప్పాలని డిమాండ్ చేశారు. మాజీ పోలీస్ అధికారి ప్రభాకర్ రావును కాపాడేందుకు ప్రభుత్వం ప్రయత్నిస్తుందని ఆరోపించారు. ఇంత హడావుడి చేస్తున్న సిట్ ఏం సాధించిందని బండి సంజయ్ ప్రశ్నించారు. ఇప్పటి వరకు ఒక్క రాజకీయ నేతను అరెస్ట్ చేయలేదన్నారు. కాంగ్రెస్ కొండను తవ్వి ఎలుకను పట్టుకోలేకపోతుందన్నారు. ఫోన్ ట్యాపింగ్ తో వేల కోట్ల రూపాయలు చేతులు మారాయని ఆరోపించారు. సిట్ విచారణ పేరుతో ప్రభుత్వం టైం పాస్ చేస్తుందన్నారు బండి సంజయ్ . స్వయంగా కేసీఆర్ కూతురే ఫోన్ ట్యాప్ అయిందని చెప్పిందన్నారు. కేసీఆర్ భయానికి యాచకులు కూడా వాట్సప్ కాల్స్ మాట్లాడుతున్నారని చెప్పారు. బీఆర్ఎస్ హయాంలోనే ఫోన్ ట్యాపింగ్ పై కంప్లైంట్ చేశానని బండి సంజయ్. తెలిపారు. ఫోన్ ట్యాపింగ్ కేసులో ఏర్పాటు చేసిన సిట్ లో ఆఫీసర్లు నిజాయితీ పరులని.. వారికి స్వేచ్ఛనివ్వాలన్నారు బండి సంజయ్. అవినీతి ఆరోపణలను డైవర్ట్ చేయడానికి హడావిడి చేస్తున్నారని విమర్శించారు. కేసీఆర్ కుటుంబాన్ని అరెస్ట్ చేసే దమ్ము రేవంత్ సర్కార్ కు లేదన్నారు బండి సంజయ్. ఏఐసీసీ ఆఫీస్ కు ..ఫాంహౌస్ కు డీల్ కుదరడం లేదని అందుకే కేసును సాగదీస్తున్నారని చెప్పారు. అన్ని ఆధారాలుంటే ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని ప్రశ్నించారు. తప్పు చేసిన పోలీసులు, అధికారులపై చర్యలు తీసుకుంటేనే ప్రజలకు నమ్మకం కల్గుతుందన్నారు బండి సంజయ్.

# బిఆర్ఎస్ నేతలతో కెటిఆర్,హరీష్ రావుల భేటీ

- సిట్ విచారణపై పార్టీ నేతలతో సమాలోచనలు
- ఓటుకు నోటు దొంగ సిఎం కావడంతోనే వేధింపులన్న కెటిఆర్

హైదరాబాద్,జనవరి23(పద్మక్రాంతి): సిట్ కార్యాలయానికి వెళ్ళేముందు తెలంగాణ భవన్ లోపల ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలతో భేటీ అయిన కేటీఆర్, హరీష్ రావు లు..భేటీ అయ్యారు. ఆతర్వాత కేటీఆర్ మీడియా తో మాట్లాడారు. ఈ కేసులో ఏమీ లేదు. మాకు ఏం సంబంధం లేదని కేటీఆర్ తెలిపారు. పదిసార్లు పిలిచినా హాజరవుతా.. అటెన్షన్ డైవర్షన్ కోసమే ఈ కుట్రలు అని మండిపడ్డారు. రేవంత్.. తన మంత్రులతో సహా మా అందరి ఫోన్లు ట్యాప్ చేస్తున్నాడు అని కేటీఆర్ ఆరోపించారు. రూ.50 లక్షలతో నోటుకు ఓటులో దొరికిన ఒక దొంగ ఇవాళ ముఖ్యమంత్రిగా ఉండటం వల్లే.. ఈ రాజకీయ కక్ష సాధింపులు అని అన్నారు. 6 గ్యారెంటీల మోసం, 420 హామీల దగా, సింగరేణి బొగ్గు కుంభకోణం నుంచి ప్రజల దృష్టి మళ్లించేందుకు ఈ కుతంత్రాలు అని ౧÷ర్ అయ్యారు. నాలుగు కోట్ల ప్రజలను నయవంచన చేసిన ముఖ్యమంత్రిని వదిలిపెట్టం.. కాంగ్రెస్ ను బొంద పెట్టేదాకా నిద్రపోం అని కేటీఆర్ తెలిపారు. విచారణలో ప్రతి ప్రశ్నకు సమాధానం చెబుతామని వెల్లడించారు. ప్రభుత్వం రాజకీయ డ్రామా ఆడుతోంది.. కెసిఆర్ సైనికులు గా ఉద్యమం నుంచి ఉద్భవించిన నాయకత్వం బీఆర్ఎస్ ది అని అన్నారు. కెసిఆర్ నాయకత్వంలో పదేళ్లు అధికారంలో ఉన్నాము. మేము ఎప్పుడూ తప్పుడు పనులు చేయలేదు.. మేము టైం పాస్ రాజకీయాలు



చేయలేదు.. ప్రతిపక్షాలను వేధించ లేదన్నారు. విచారణ లకు భయపడే వారు ఎవరూ లేరని తెలిపారు. రాష్ట్రంలో పాలన పిచ్చోడి చేతిలో రాయి లాగా మారిందని ఎద్దేవ చేశారు. రోజుకో అంశం తో డ్రామా ఆడుతున్నారని మండిపడ్డారు. పుట్టిన భూమి సాక్షిగా అక్రమ, అనైతిక పనులు నేను చేయలేదు. నేను డ్రగ్స్ తీసుకుంటానని.. నాకు హీరోయిన్ లతో సంబంధాలు ఉన్నాయని ప్రచారం చేశారన్నారు. మా కుటుంబాలను ఇబ్బంది పెట్టారు.. అయినా నేను ఎప్పుడూ భయపడలేదు.. హీరోయిన్ ల ఫోన్ లు ట్యాప్ అయ్యాయని మీరే లీకులు ఇచ్చారు.. మళ్ళీ ఏమి లేదని మీరే అన్నారు. ఈ రాష్ట్రంలో ఇప్పుడు ఫోన్ లు ట్యాప్ అవ్వడం లేదని పోలీసులు చెబుతారా అని కేటీఆర్ ప్రశ్నించారు. ఈ విషయంపై డీజీపీ శివదర్ రెడ్డి మీడియా ముందు చెబుతారా అని ప్రశ్నించారు. బొగ్గు స్కాం ను హరీష్ రావు బయట పెట్టారు.. మంత్రులు, కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు స్పందించలేదు.. హరీష్ రావు కు నోటీసులు ఇచ్చి పిలిస్తే.. వాళ్లకు ఎలా సమాధానం చెప్పాలో అలా చెప్పాడని తెలిపారు. రాష్ట్రంలో దోపిడి దొంగల ముఠా ప్రభుత్వం ఉంది. రాష్ట్రంలో కొందరు పోలీసులు ప్రభుత్వానికి తొత్తులుగా వ్యవహరిస్తున్నారని కేటీఆర్ మండిపడ్డారు.

మొదటి పేజీ తరువాయి ..

# చట్టప్రకారమే ట్యాపింగ్ విచారణ

విచారణకు పిలుస్తామని చెప్పామని ప్రస్తావించారు. కేటీఆర్‌ను ఒంటరిగానే విచారించామని సజ్జనార్ పేర్కొన్నారు. ఫోన్ ట్యాపింగ్ కేవలం భద్రతా కారణాల దృష్ట్యా మాత్రమే జరిగిందని వివరించారు. ఇందులో ఎలాంటి చట్టవ్యతిరేకత లేదని కొన్ని మీడియా వర్గాలు, వ్యక్తులు నిరాధారమైన, తప్పుదోవ పట్టించే సమాచారాన్ని ప్రచారం చేస్తున్నట్లు తమ దృష్టికి వచ్చిందని వెల్లడించారు. దర్యాప్తు సంస్థకు ఇలాంటి తప్పుడు కథనాలతో సంబంధం లేదని స్పష్టం చేశారు. ఈ దర్యాప్తు పూర్తిగా చట్టప్రకారం, నిష్పక్షపాతంగా, వృత్తిపరమైన ప్రమాణాలతో జరుగుతోందనిపేర్కొన్నారు. రాజకీయ నాయకులు, వ్యాపారవేత్తలు, జర్నలిస్టులు, న్యాయమూర్తులు, ప్రముఖులతో సహా వేలాది మంది పౌరుల ఫోన్లను అనధికారికంగా, చట్టవిరుద్ధంగా ఇంటర్‌సెప్షన్ (ట్యాపింగ్), నిఘా పెట్టారనే ఆరోపణలపై తాము విచారణ చేస్తున్నామని సజ్జనార్ స్పష్టం చేశారు.

# మేడారంలో జనజాతర



మంచిర్యాల్ చేరుకుంటుంది. తిరిగి అదేరోజు మధ్యాహ్నం 3.30 గంటలకు మంచిర్యాల్-సికిందరాబాద్ రైలు (07496) మంచి ర్యాల్‌లో బయలుదేరి రాత్రి 8 గంటలకు కాజిపేటకు, రాత్రి 10.10 గంటలకు సికిందరాబాద్ చేరుకుంటుంది. నెల 29, 31 తేదీల్లో సికింద్రారాబాద్-సిరిపూర్ కాగజ్ నగర్-సికింద్రాబాద్ మేడారం (07497/07498) ప్రత్యేక రైళ్లు నడుస్తాయి, ఈ తేదీలలో మేడారం జాతర ప్రత్యేక రైళ్లు సికింద్రాబాద్ నుంచి ఉదయం ఉదయం 5.45 గంటలకు బయలుదేరి ఉదయం 8.45 గంటలకు కాజీపేటకు, మధ్యాహ్నం 2 గంటలకు సిరిపూర్ కాగజ్‌నగర్ చేరుకుంటాయి. అదే రోజు మధ్యాహ్నం 2.30 గంటలకు సిరిపూర్ కాగజ్‌నగర్‌లో బయలుదేరి రాత్రి 7.45 గంటలకు కాజిపేటకు, రాత్రి 10.10 గంటలకు సికింద్రాబాద్ చేరుకుంటాయి. నిజామాబాద్-వరంగల్- నిజామాబాద్ మేడారం జాతర ప్రత్యేక రైళ్లు (07498/07499) ఈ నెల 28 నుంచి 31 వరకు రాకపోకలు సాగిస్తాయి. ఈ రైళ్లు నిజామాబాద్‌లో ఉదయం 7.05 గంటలకు బయలుదేరి మధ్యాహ్నం 2 గంటలకు వరంగల్ చేరుకుంటాయి. తిరిగి అదే రోజు మధ్యాహ్నం 2.40 గంటలకు వరంగల్‌లో బయలుదేరి అదే రాత్రి 10.30 గంటలకు నిజామాబాద్ చేరుకుంటాయి. ఈ నెల 28 నుంచి ఫిబ్రవరి 1 వరకు ఖమ్మం-కాజీపేట-ఖమ్మం మేడారం ప్రత్యేక రైళ్లు (07503/07504) ఉదయం 10 గంటలకు ఖమ్మంలో బయలుదేరి మధ్యాహ్నం 12.50 గంటలకు కాజీపేట చేరుకుంటాయి. తిరిగి అదే రోజు మధ్యాహ్నం 2 గంటలకు కాజీపేటలో బయలుదేరి సాయంత్రం 5.30 గంటలకు ఖమ్మం చేరుకుంటాయి. ఆదిలాబాద్-కాజీపేట (07501)మేడారం జాతర ప్రత్యేక రైలు ఈ నెల 28న రాత్రి 11.30 గంటలకు ఆదిలాబాద్‌లో బయలుదేరి మరుసటి రోజు (29 తేదీ) ఉదయం 11.45 గంటలకు కాజీపేటకు చేరుకుంటుంది. అలాగే కాజిపేట- ఆదిలాబాద్ (07502)మేడారం ప్రత్యేక రైలు ఈ నెల 29వ తేది మధ్యాహ్నం 1.15 గంటలకు కాజీపేటలో బయలుదేరి మరుసటి రోజు (30వ తేదీ) తెల్లవారు జామున 4 గంటలకు ఆదిలాబాద్ చేరుకుంటుంది.

# జనగణనకు కేంద్రం రంగం సిద్ధం

వంటి వివరాలు కూడా సేకరించాలని ఆదేశించింది. కుటుంబంలో ఎవరెవరు ఏయే పని చేస్తున్నారో స్పష్టమైన వివరాలు సేకరించాల్సిదే కేంద్రం తేల్చి చెప్పింది. ఏ విధమైన మరుగుదొడ్డి ఉందో రికార్డుల్లో స్పష్టంగా చెప్పాలని గణన అధికారులకు కేంద్ర ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. స్నానాల కోసం ఏ తరహా బాత్‌రూం ఉందో వివరాల్లో పొందుపరచాలని తెలపాలని వెల్లడించింది. వంట కోసం వాడుతున్న గ్యాస్ కనెక్షన్ వివరాలను కూడా అధికారులు సేకరించనున్నారు. ఇంటి యజమాని ఎస్సీ, ఎస్టీ, ఇతర ఏ వర్గానికి చెందిన వారో అనే వివరాలు తప్పక నమోదు చేయాల్సి ఉంటుంది.

# మేడారం జాతరకు కేంద్రం భారీ సహాయం

మంత్రిత్వ శాఖలు సంయుక్తంగా నిధులు మంజూరు చేశాయి. రెండేళ్లకు ఒకసారి నిర్వహించే మేడారం జాతరకు దేశ వ్యాప్తంగా కోట్లాది మంది భక్తులు తరలివస్తుండటంతో.. భక్తులకు మెరుగైన మౌలిక సదుపాయాలు కల్పించడమే లక్ష్యంగా ఈ నిధులను విడుదల చేసినట్లు కేంద్ర ప్రభుత్వం తెలిపింది.కేంద్ర పర్యాటక శాఖ ఆధ్వర్యంలో 'గిరిజన సర్క్యూట్' పథకం కింద ఇప్పటికే మేడారం పరిసర ప్రాంతాల్లో పర్యాటక అభివృద్ధి పనులు చేపట్టిన విషయం తెలిసిందే. ఈ పథకం కింద గతంలో సుమారు రూ.80 కోట్ల వ్యయంతో ములుగు, లక్నవరం, మేడారం, తాడ్వాయి, దామరవాయి, మల్లూరు, బొగత జలపాతం వంటి ప్రాంతాల్లో పర్యాటకులకు అవసరమైన మౌలిక సదుపాయాలు, అభివృద్ధి పనులు కల్పించారు. రోడ్లు, వసతి సౌకర్యాలు, పర్యాటక సమాచార కేంద్రాలు, ఇతర సదుపాయాలు కల్పించడంతో ఈ ప్రాంతాలకు పర్యాటక ఆకర్షణ మరింత పెరిగింది. సమ్మక్క - సారలమ్మల జాతరగా ప్రసిద్ధి చెందిన మేడారం జాతర గిరిజన సంప్రదాయాలు, విశ్వాసాలకు ప్రతీకగా నిలుస్తోంది. ప్రతి జాతరతో భక్తుల సంఖ్య పెరుగుతుండటంతో కేంద్ర ప్రభుత్వం నిరంతరంగా సహకారం అందించడం గిరిజన సంస్కృతి పరిరక్షణకు తోడ్పడుతుందని పలువురు అభిప్రాయపడుతున్నారు. యునెస్కో ప్రపంచ వారసత్వ హోదా పొందిన రామప్ప దేవాలయం అభివృద్ధి కోసం కేంద్ర ప్రభుత్వం రూ.140 కోట్లను వెచ్చిస్తోంది. రామప్ప ఆలయం, మేడారం జాతర, పరిసర అటవీ ప్రాంతాలు అన్నింటినీ కలిపి తెలంగాణ గిరిజన, ఆధ్యాత్మిక పర్యాటకానికి ప్రత్యేక గుర్తింపునిచ్చేలా అభివృద్ధి పనులు జరుగుతున్నాయి. అమ్మవార్లకు బంగారం(బెల్లం) సమర్పించి మొక్కులు తీర్చుకునేందుకు రాష్ట్రం నలుమూలల నుంచి, పొరుగు రాష్ట్రాల నుంచి లక్షలాది మంది భక్తులు మేడారం జాతరకు తరలివస్తుంటారు. ఈ నేపథ్యంలో భక్తుల రవాణా సౌకర్యార్థం దక్షిణ మధ్య రైల్వే శాఖ జాతర జరిగే నాలుగు రోజుల పాటు 30 ప్రత్యేక రైళ్లను నడుపుతోంది. ఈ రైళ్ల ద్వారా తెలంగాణతో పాటు ఆంధ్రప్రదేశ్, మహారాష్ట్ర తదితర రాష్ట్రాల నుంచి భక్తులు సులభంగా మేడారం చేరుకునేలా ఏర్పాటు చేశారు.

RNI No : TELTEL/2022/85167
పద్మక్రాంతి
తెలుగు దినపత్రిక

# చెంగిచెర్ల అర్బన్ ఫారెస్ట్ అభివృద్ధి పై కేంద్ర ప్రభుత్వం ఫోకస్

**నగర్ వన్ యోజన పథకంలో చెంగిచెర్ల ఫారెస్ట్ ఎంపిక**
**తెలంగాణలో ఆరు ఫారెస్ట్ అభివృద్ధికి 8.26 కోట్ల రూపాయల మంజూరు**
**- కేంద్ర ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపిన రాష్ట్ర బిజెపి నాయకులు సిలివేరు శంకర్ ప్రజాపతి**





బోడుప్పల్, జనవరి 23 (పద్మక్రాంతి):

వికసిత్ భారత్ లో భాగంగా పట్టణాల్లో పచ్చదనం పెంపొందించడమే లక్ష్యంగా కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న 'నగర్ వన్ యోజన' పథకం క్రింద తెలంగాణ రాష్ట్రంలో 2025-26 ఆర్థిక స్పంవత్సరానికి సంబంధించి 6 అర్బన్ ఫారెస్టుల ఏర్పాటుకు సుమారు రూ. 8.26 కోట్ల రూపాయలు మంజూరు చేయడం జరిగింది. తెలంగాణ రాష్ట్రవ్యాప్తంగా ఏర్పాటుకానున్న ఈ అర్బన్ ఫారెస్ట్ లలో ఆదిలాబాద్ జిల్లాలో మావళా, యాపల్ గూడా-2 ప్రాంతాలు, మంచిర్యాల జిల్లాలో క్యాతనపల్లి ఇందారం, చెన్నూరు ప్రాంతాలతోపాటు మన మేడ్చల్-మల్కాజ్గిరి జిల్లాలోని ఎల్లంపేట్, చెంగిచెర్ల ప్రాంతాలకు చోటుదక్కడం విశేషం. స్థానిక వృక్షసంపదకు ప్రాధాన్యత కల్పిస్తూ పర్యావరణ కాలుష్యాని నియంత్రించేందుకు, ప్రజలకు ఆరోగ్యకరమైన ప్రకృతిసహజమైన అటవీ వాతావరణాన్ని కల్పించేందుకు చెంగిచెర్లను కూడ 'నగర్ వన్ యోజన' లో చేర్చడం హర్షనీయమని చెంగిచెర్ల అర్బన్ ఫారెస్ట్ అందుబాటులోకి వస్తే పిల్లలకు, వాకర్లకు, వృద్ధులకు ప్రతిఒక్కరికి ప్రకృతి ఒడిలో కాసేపు సేదతీరినట్లు ఉంటుందని, భవిష్యత్ తరాలకు స్వచ్ఛమైన గాలిని, అందమైన ప్రకృతిని అందించగలుగుతామని బిజెపి రాష్ట్ర నాయకులు సిలివేరు శంకర్ ప్రజా ప్రతి అన్నారు. బోడుప్పల్, చెంగిచెర్ల ప్రజల పక్షాన కేంద్ర ప్రభుత్వానికి ఆయన ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

# వెస్ట్ బాలాజీ హిల్స్ కాలనీ సమస్యలను పరిష్కరించండి

- డిప్యూటీ కమిషనర్ శైలజ కు కాలనీవాసుల వినతిపత్రం
- మంచినీటి సమస్య, రోడ్డు మరమ్మత్తులు, దోమల నివారణ చర్యలు తీసుకోవాలని చింతల శ్రీనివాస్ రెడ్డి




బోడుప్పల్, జనవరి 26 (పద్మక్రాంతి):

జిహెచఎంసి బోడుప్పల్ సర్కిల్ పరిధిలోని పరిధిలోని బోడుప్పల్ శ్రీ వెస్ట్ బాలాజీ హిల్స్ కాలనీలో డ్రైనేజీ, మంచినీటి, రోడ్డు మరమ్మత్తుల వంటి పలు సమస్యలను పరిష్కరించాలని కోరుతూ వెస్ట్ బాలాజీ హిల్స్ కాలనీ అసోసియేషన్ ఆధ్వర్యంలో బోడుప్పల్ సర్కిల్ డిప్యూటీ కమిషనర్ ఏ.శైలజ కు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా కాలనీ అధ్యక్షుడు, బోడుప్పల్ కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షులు చింతల శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ 3,4 రోజులకు ఒకసారి మంచి నీళ్లు వస్తున్నాయని, వచ్చే వేసవిని దృశ్య డే బై డే తాగునీరు అందించాలని, సిసి రోడ్ల ప్యాచ్ వర్క్ లు పూర్తి చేయాలని, దోమల నివారణకు చర్యలు తీసుకోవాలని డిప్యూటీ కమిషనర్ కు విన్నవించామని తెలిపారు. ఈ కార్యక్రమంలో కాలనీ పెద్దలు వీర శెట్టి, డి శ్రీధర్, ప్రభావతి, డి శారద, పి.బి. విజయ కుమారి, చిత్రలేఖ, సాయికృష్ణ, ఉప్పలయ్య, తదితరులు పాల్గొన్నారు.

# రైతులకు ధాన్యం మద్దతు ధర చెల్లింపులు

- జిల్లాకు దక్కిన ప్రశాంస పత్రం
- సివిల్ సప్లై డీఎంకు మంత్రి ఉత్తమ్ అభినందన

యాదాద్రి భువనగిరి, జనవరి 23 (పద్మక్రాంతి) :




ఖరీఫ్ 2025-26 సీజన్‌లో ధాన్యం కొనుగోలు చేసి రైతులకు మద్దతు ధర చెల్లింపుల్లో యాదాద్రి భువనగిరి జిల్లా పౌర సరఫరాల శాఖ జిల్లా మేనేజరు డీ. హరిక్రిష్ణను పౌర సరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి అభినందించారు. రాష్ట్రంలోని అన్ని జిల్లాలలో ధాన్యం కొనుగోలు చేసిన ప్రభుత్వం రైతులకు మద్దతు ధర చెల్లించింది. యాదాద్రి భువనగిరి జిల్లాలో ఈ సీజన్‌లో 49 వేల 86 మంది రైతుల వద్ద 3.91 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేసి 3 రోజుల్లోనే రైతులకు పూర్తి స్థాయిలో రూ. 758.90 కోట్ల మద్దతు ధరను వారి బ్యాంకు ఖాతాల్లో జమ చేశారు. రైతులకు మద్దతు ధరను వేగంగా అందేలా చేసిన డీఎం హరిక్రిష్ణను శుక్రవారం హైదరాబాద్‌లో మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి, సివిల్ సప్లై కమీషనర్ స్టీఫెన్ రవీంద్ర అభినందించి ప్రశాంసాపత్రం అందజేశారు.

# పేరూర్ శ్రీ సరస్వతీ మాత ఆలయంలో ఘనంగా వసంత పంచమి వేడుకలు




మెదక్, జనవరి23 (పద్మక్రాంతి)

:మెదక్ జిల్లా,మెదక్ మండల పరిధిలోని పేరూరు మంజీరా నది తీరాన వెలసిన సరస్వతీ మాత 24వ ఆలయ వార్షికోత్సవం సందర్భంగా ఆలయంలో వసంత పంచమి వేడుకలు శుక్రవారం ఉదయం తెల్లవారుజామున నుంచి అంగరంగ వైభవంగా ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా ఆలయ వ్యవస్థాపకులు దోర్భల రాజ మౌళిశర్మ,అర్చకులు దొర్భల మహేష్ శర్మలు అమ్మవారికి మంజీరా నది జలాలతో అభిషేకం తదితర పూజా కార్యక్రమాలు చేసి అమ్మవారిని విశేషాలంకరణ చేసి ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం ఓడిబియ్యాలు, కుంకుమార్చనలు,చిన్నారులకు అక్షరాభ్యాసం తదితర కార్యక్రమాలు నిర్వహించారు. ఆలయం పరిసరాల్లో శకట బ్రహ్మోత్సవం బండ్లు తిరుగుట కన్నుల పండువగా జరుగుతున్నాయి.వసంత పంచమి సందర్భంగా వివిధ ప్రాంతాల నుండి భక్తులు అధిక సంఖ్యలో తరలివస్తున్నారు. ఆలయ సిబ్బంది సామూహిక అక్షరాభ్యాసం చేయించేందుకు పూర్తి స్థాయిలో అన్ని ఏర్పాట్లు చేశారు. భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ



కార్యక్రమంలో ఆయా గ్రామాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలి వచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు.

# శ్రీ సంతోషిమాత ఆలయంలో జక్క వెంకట్ రెడ్డి ప్రత్యేక పూజలు

- వసంత పంచమి సందర్భంగా ఘనంగా భద్ర పూజ కార్యక్రమం
- కార్యక్రమంలో పాల్గొన్న బీఆర్ఎస్ నేతలు, మాజీ కార్పొరేటర్లు






పీర్జాదిగూడ, జనవరి 23, (పద్మక్రాంతి):

వసంత పంచమి సందర్భంగా జిహెచఎంసి పరిధిలోని పీర్జాదిగూడ డివిజన్ పరిధిలో గల శ్రీ సంతోషి మాత దేవాలయంలో నిర్వహించిన భద్రపూజ కార్యక్రమంలో మాజీ మేయర్ జక్క వెంకట్ రెడ్డి, బీఆరఎస్ ప్రధాన కార్యదర్శి ఏడవల్లి రఘువర్ధన్ రెడ్డి, మాజీ కార్పొరేటర్లు దొంతిరి హరిశంకర్ రెడ్డి, కొల్తూరి మహేష్, జావీద్ ఖాన్, బుల్లెట్ శంకర్, కొల్తూరి మధు, శంకర్ తదితరులు పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించి ఆశీర్వాదాలు తీసుకోవడం జరిగింది. ఈ కార్యక్రమంలో కమిటీ సభ్యులు యోగిందర్ వర్మ, అరబింద్ సింగ్, బీహారిలాల్, దీనానాథ్ సింగ్, రాంబాబు గుప్త తదితరులు పాల్గొన్నారు.

# గంగాపూర్ జాతరలో భక్తులకు ఇబ్బందులు లేకుండా సౌకర్యాలు కల్పించాలి

- – జిల్లా కలెక్టర్ కె.హరిత



రెబ్బెన, జనవరి 23, (పద్మక్రాంతి):

రెబ్బెన మండలం గంగాపూర్ గ్రామంలో జరగనున్న బాలాజీ వెంకటేశ్వర స్వామి జాతర మహోత్సవంలో భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా పూర్తి సా-ధ్యయిలో సౌకర్యాలు కల్పించాలని జిల్లా కలెక్టర్ కె.హరిత అన్నారు. శుక్రవారం గంగాపూర్ గ్రామాన్ని సందర్శించి జాతర మహోత్సవాల ఏర్పాట్లపై దేవాదాయ శాఖ అధికారులు, గ్రామపంచాయతీ సర్పంచ్, ఇతర అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ... జాతరలో భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా త్రాగునీరు, పారిశుద్ధ్య, వాహనాల పార్కింగ్, దుకాణ సముదాయాలు, భారీ కేడ్లు ఏర్పాట్లను పకడ్బందీగా చేపట్టాలని తెలిపారు. జాతరలో ప్రముఖుల సందర్శన, అత్యవసర సేవలు నిమిత్తం అంబులెన్స్, ఇతర పూర్తి ఏర్పాట్లను చేపట్టాలని తెలిపారు. ఈ సందర్భంగా బాలాజీ వెంకటేశ్వర స్వామి దేవాలయ చరిత్రను దేవాదాయ శాఖ అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థులకు మౌలిక, సదుపాయాలు సహకారాలు అందిస్తాం.






**- వైద్యులు డా. స్వరూప డా. శరత్ బాబు**


మంచిర్యాల జిల్లా/ రామకృష్ణాపూర్ జనవరి 23 (పద్మక్రాంతి):

ప్రభుత్వ పాఠశాలలలో విద్యార్థుల మౌలిక సౌకర్యాల కోసం ఆర్థిక సహకారాలు అందించడానికి కృషి చేస్తామని మంచిర్యాల స్వరూప హాస్పిటల్ వైద్యులు డా. స్వరూప - డా. శరత్ బాబు దంపతులు అన్నారు. ఈ సందర్భంగా క్యాతనపల్లి మున్సిపాలిటీ పరిధిలో ప్రాథమిక మండల పరిషత్ ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థుల సౌకర్యార్థం శుక్రవారం సౌండ్ సిస్టమ్ అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ విద్యార్థి దశలోనే ఒక లక్ష్యాన్ని ఎంచుకున్నట్లయితే ఉన్నత శిఖరాలను చేరుతారని విద్యార్థులకు వారు సూచించారు. విద్యార్థులు సాంస్కృతిక నృత్యాలను నేర్చుకోవడానికి స్పీకర్ సిస్టమ్ బాక్స్ దోహదపడుతుందని పేర్కొన్నారు. హెడ్ మాస్టర్ వైద్య వనజ మాట్లాడుతూ విద్యార్థుల అవసరం తెలుసుకొని పాఠశాలకు సహకరించిన వైద్యులకు కృతజ్ఞతలు తెలిపారు. పాఠశాలలో విద్యార్థులకు అన్ని రకాల సౌకర్యాలను కల్పిస్తున్నామని తెలియజేస్తూ తల్లితండ్రులు ప్రభుత్వ పాఠశాలలో తమ పిల్లలను చేర్పించాలని కోరారు. అంతేకాకుండా పాఠశాల విద్యార్థులకు హైదరాబాద్ లో నివాసం ఉంటున్న ఉష విద్యార్థులకు స్కూల్ బ్యాగ్ లను అందజేసినట్లు పేర్కొన్నారు. పాఠశాలలో వసతులు కల్పిస్తున్న నేపథ్యంలో వైద్యులు స్వ-రూపా శరత్ బాబు దంపతులు ప్రిన్సిపాల్ వనజను శాలువాతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయురాలు సరళ, మల్లీశ్వరి, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

# ఘనంగా శ్రీ సీతారామాంజనేయ స్వామి దేవాలయ ప్రథమ వార్షికోత్సవం

- ప్రత్యేక పూజలు నిర్వహించిన బిజెపి నాయకులు, కాలనీవాసులు





బోడుప్పల్, జనవరి 23 (పద్మక్రాంతి):

జిహెచఎంసి బోడుప్పల్ సర్కిల్ పరిధిలోని శ్రీ సాయి నగర్ కాలనీ శ్రీ సీతారామాంజనేయ స్వామి దేవాలయ ప్రథమ వార్షిక మహోత్సవాలను కాలనీ అసోసియేషన్ సభ్యులు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బిజెపి నాయకులు బిజెపి తల్లారి రవి , సామల పవన్, తుప్పత్ ఆనంద్, భానుకుంట వేణు, శరత్ చంద్ర, బజ్జురి శ్రీనివాస్ గుప్త, సతీష్, సురేష్, ప్రతాప్ రెడ్డి, శ్రీ సాయి నగర్ కాలనీ అధ్యక్షులు జనార్దన్ రెడ్డి, అసోసియేషన్ సభ్యులు సంతోష్, చంద్రశేఖర్ ప్రేమ్ కుమార్, వెంకటేశ్వర్లు, మనోజ్, మునిరత్నం, మహేష్, రమణ, గోపాల్ రావు, భీమ్ రెడ్డి నగర్ శివశంకర్, నిరంజన్ రెడ్డి, బసవ రెడ్డి, తదితరులు పాల్గొని ప్రజలందరూ సుభిక్షంగా ఉండాలని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం తీర్థప్రసాదాలు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో కాలనీవాసులు, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# నేషనల్ ఓటర్స్ డే కార్యక్రమంలో పాల్గొన్న సర్పంచ్ కాసు శ్రీనివాసరెడ్డి,



తలకొండపల్లి, జనవరి 23 పద్మక్రాంతి:

తలకొండపల్లి మండలంలోని లింగారావుపల్లి గ్రామంలో తలకొండపల్లి నేషనల్ ఓటర్స్ డే కార్యక్రమాన్ని తహసిల్దార్ ఆధ్వర్యంలో నిర్వహించడం జరిగింది. లింగారావుపల్లి గ్రామ సర్పంచ్ కాసు శ్రీనివాస్ రెడ్డి నేషనల్ ఓటర్స్ డే నీ ఘనంగా నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో లింగారావుపల్లి గ్రామ సర్పంచ్ శ్రీ కాసు శ్రీనివాస్ రెడ్డి ఉప సర్పంచ్ బూత్కూరు వెంకట్ రెడ్డి, గ్రామ పంచాయతీ కార్యదర్శి, విష్ణువర్ధన్ రెడ్డి స్కూల్ హెడ్మాస్టర్ కృష్ణారెడ్డి, వార్డ్ మెంబర్లు రాజమోమి భాగ్య శివలింగం జంగయ్య గ్రామ బి ఎల్ ఓ, మల్లమ్మ పద్మమ్మ గ్రామా నాయకులు బండ నరసింహారెడ్డి తిరుపతి గౌడ్ బోచ్చిపల్లి రాములు ప్రమోద్ లోకేష్ రబ్బాని లోకేష్ నరసింహ కుమార్ మరియు గ్రామ సిబ్బంది అంగన్వాడి టీచర్స్ మరియు విద్యార్థిని విద్యార్థులు తదితరులు పాల్గొనడం జరిగింది.

# గడ్డమీది తాండలో ఉచిత పశు గర్భకోశ వ్యాధి చికిత్స శిబిరం.

**ముఖ్య అతిథిగా పాల్గొన్న గ్రామ సర్పంచ్ సరోజభీమ్లాల్**

తలకొండపల్లి, జనవరి 23 పద్మక్రాంతి:

తలకొండపల్లి మండల పరిధిలోనీ ఆల్రకుంటతాండ దగ్గర గోపాలమిత్ర కేంద్రంలో పశుసంవర్ధక మరియు జిల్లా పశు గణాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో పశువైద్యాధికారి డాక్టర్ విజయకుమార్ ఆధ్వర్యంలో ఉచిత గర్భకోశ వ్యాధులు గల పశువులకు చూడి పరీక్షలు నిర్వహించినారు ఈ సందర్భంగా మందులు ఇవ్వడంతో పాటు ఎదకు వచ్చిన పశువులకు కృత్రిమ గర్భధారణ మరియు దూడలకు నట్టల నివారణ మందులు త్రాగించడం జరిగింది. సర్పంచ్ సరోజభీమ్లాల్ మాట్లాడుతూ...

గ్రామంలో ఉన్న అన్ని పాడిపశువులకు నాణ్యమైన చికిత్స అందించాలని పశు వైద్య అధికారులు చెప్పిన విధంగా చికిత్సలు చేయించుకోవాలని అదేవిధంగా గ్రామంలో ఏర్పాటు చేసిన ఉచిత పశు గర్భశోక వ్యాధి చికిత్స అన్ని



ఆవులకు ఉచితంగా చేయించుకోవాలని తెలియజేయడం జరిగింది తాండలో గోపాలమిత్ర క్యాంపు ఏర్పాటుచేసిన మండల పశు వైద్య అధికారి విజయ్ కి మరియు వారి సిబ్బందికి ధన్యవాదాలు తెలియజేయడం జరిగింది

ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ శాంతిజాను,వార్డు మెంబర్ రాజు,రైతులు గోపాల మిత్ర సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

RNI No : TELTEL/2022/85167

పద్మక్రాంతి

(వాస్తవాలు వెలుగులోకి) తెలుగు దినపత్రిక

### భారతీయులకు రాజ్యాంగం కల్పించిన

## అమూల్యమైన హక్కు 'ఓటు'

**బోడుప్పల్ సర్కిల్ కార్యాలయంలో 16వ జాతీయ ఓటర్ దినోత్సవం**





**బోడుప్పల్,జనవరి 23 (పద్మక్రాంతి):**

భారతీయులందరికీ భారత రాజ్యాంగం కల్పించిన అతి ముఖ్యమైన,విలువైన హక్కు ఓటు హక్కు. అలాంటి ఓటు హక్కును చాలామంది నమోదు చేసుకోకపోవడం, ఓటు హక్కు వినియోగించుకోవడం లేదు. 18 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరు ఓటు హక్కును కలిగి ఉండాలని దానిని సద్వినియోగ పరుచుకునే విధంగా ఓటు హక్కుపైన, ప్రజాస్వామ్య వ్యవస్థ పైన ప్రజలకు అవగాహన కల్పించుటకు జాతీయ ఓటర్ల దినోత్సవం జరుపుతాము. ఇందులో భాగముగా ఈ సంవత్సరం " నా భారత్ నా ఓటు" అనే నినాదంతో 16వ జాతీయ ఓటర్ దినోత్సవం బోడుప్పల్ సర్కిల్ కార్యాలయంలో డిప్యూటీ కమీషనర్ ఎ. శైలజా అధ్యక్షతన నిర్వహించారు. ఓటు హక్కు గురించి ప్రజలలో విస్తృతంగా అవగాహన కల్పించాలని దీనికి ప్రత్యేక కార్యక్రమాలు రూపొందించాలని అధికారులకు డిప్యూటీ కమిషనర్ శైలజ సూచించారు. అనంతరం మునిసిపల్ అధికారులు, సిబ్బంది తో ఓటర్ ప్రతిజ్ఞ చేయించారు.

## శ్రీ సమ్మక్క సారక్కలను దర్శించుకున్న మద్ది యుగంధర్ రెడ్డి దంపతులు

- వనదేవతలకు ప్రత్యేక పూజలు







**పీర్జాదిగూడ, జనవరి 23 (పద్మక్రాంతి):**

తెలంగాణ కుంభమేళాగా ఆసియాలోని అతిపెద్ద ఆదివాసి జాతర మేడారం శ్రీ సమ్మక్క సారక్క జాతర సందర్భంగా పీర్జాదిగూడ మాజీ కార్పొరేటర్ మద్ది యుగంధర్ రెడ్డి,ఇంద్రాజ రెడ్డి దంపతులు, భువనగిరి మార్కెట్ కమిటీ మాజీ డైరెక్టర్ పెద్దిరెడ్డి నరేందర్ రెడ్డి అలివేల రెడ్డి, పెద్దిరెడ్డి బలరాం రెడ్డి విలాసిని రెడ్డి దంపతులు శ్రీ సమ్మక్క శ్రీసారక్క గద్దెలను దర్శించుకుని అమ్మవార్లకు బంగారాన్ని (బెల్లం) నైవేద్యంగా సమర్పించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. రాష్ట్ర ప్రజలందరూ సుఖ సంతోషాలతో ఉండాలని, పాడి,పంటలతో తెలంగాణ రాష్ట్రం సుభిక్షంగా ఉండాలని అమ్మవార్లను వేడుకున్నట్లు మద్ది యుగంధర్ రెడ్డి తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సారథ్యంలో కాంగ్రెస్ ప్రభుత్వం భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా సకల ఏర్పాట్లు చేసిందని ఆయన అన్నారు

## కల్వకుర్తిలో ఘనంగా వసంత పంచమి వేడుకలు...





**పద్మక్రాంతి,జనవరి,23 ( కల్వకుర్తి ప్రతినిధి ):**

కల్వకుర్తి పట్టణంలో సుభాష్‌నగర్‌లోని శ్రీ సరస్వతి శిశు మందిర్ ఉన్నత పాఠశాలలో వసంత పంచమి సందర్భంగా అక్షరాభ్యాస కార్యక్రమం హోమం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో 77 మంది చిన్నారులు అక్షరాభ్యాసం చేయించుకోగా, సుమారు 250 మంది తల్లిదండ్రులు, పోషకులు పాల్గొన్నారు.

ఈ సందర్భంగా ప్రబంధకారిణి సభ్యురాలు శ్రీమతి నిర్మల అక్షరాభ్యాసం ప్రాముఖ్యతను వివరించారు. కార్యక్రమంలో ప్రధానాచార్యులు సేవకుల రాజు, విద్వత్ సమితి సభ్యులు సూరం తిరుపతి రెడ్డి దామోదర్ రెడ్డి ,ప్రబంధ కారిణి సభ్యులు శ్రీ కూన కిశోర్ ఆచార్యులు, మాతాజీలు, విద్యార్థులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

### "భక్తి పారవశ్యం.. సంకల్ప సిద్ధి దిగ్విజయంగా ముగిసిన

# హరి ప్రసాద్ రెడ్డి శ్రీశైలం మహా పాదయాత్ర"


- ముగిసిన 300 కిలోమీటర్ల ప్రస్థానం మల్లికార్జునుడి సన్నిధిలో రుద్రారం భక్త సమూహం
- అడ్డంకులు లేని పయనం విజయవంతమైన శివయ్య ధ్యానం
- రుద్రారం నుండి శ్రీశైలం వరకు .. హరి ప్రసాద్ రెడ్డి భక్తి బాట



**పటాన్‌చెరు, జనవరి 23 (పద్మక్రాంతి):**

నిశ్చలమైన భక్తి, దృఢమైన సంకల్పం తోడైతే ఎంతటి కఠినమైన కార్యమైనా సుసాధ్యమేనని రుద్రారం గణేష్ గడ్డ దేవస్థానం చైర్మన్, తాజా మాజీ ఎంపీటీసీ అల్లంరెడ్డి గారి హరి ప్రసాద్ రెడ్డి నిరూపించారు. శివ దీక్షలో ఉన్న ఆయన, రుద్రారం నుండి జ్యోతిర్లింగ క్షేత్రమైన శ్రీశైలం వరకు చేపట్టిన 'మహా పాదయాత్ర' ఏడు రోజుల పాటు సాగి, శుక్రవారం నాటికి విజయవంతంగా ముగిసింది.

**ఏడు రోజులు.. 300 కిలోమీటర్ల ప్రస్థానం**



వినాయకుడి ఆశీస్సులతో ప్రారంభమైన ఈ యాత్ర భక్తిభావంతో సాగింది. రుద్రారం నుంచి శ్రీశైలం వరకు సుమారు 280 కిలోమీటర్ల దూరాన్ని హరి ప్రసాద్ రెడ్డి కాలినడకన అధిగమించారు. మండుతున్న ఎండను, దారిలోని కష్టాలను లెక్కచేయకుండా 'ఓం నమఃశివాయ' స్మరణతో సాగిన ఈ ప్రయాణం ఆధ్యాత్మికతకు అద్దం పట్టింది.

**విఘ్నేశ్వరుడి ఆశీర్వాదమే శ్రీరామరక్ష**

ఈ సందర్భంగా హరి ప్రసాద్ రెడ్డి మాట్లాడుతూ.. ఏ కార్యానికైనా ఆ గౌరీ నందనుడు, వరసిద్ధి వినాయకుడి ఆశీర్వాదం ఉంటే విఘ్నాలు తొలగి విజయం లభిస్తుంది. ఆ దైవ సంకల్పంతోనే ఈ 300 కిలోమీటర్ల యాత్ర ఎలాంటి ఆటంకాలు లేకుండా పూర్తయింది. ఇది నా జీవితంలో ఎప్పటికీ గుర్తుండిపోయే మరుపురాని ఘట్టం,అని వెల్లడించారు.

# ఓటుహక్కు పై అవగాహన కలిగి ఉండాలి

### జాతీయ ఓటరు దినోత్సవం లో తహసీల్దారు అంజిరెడ్డి

**యాదాద్రి భువనగిరి, జనవరి 23 (పద్మక్రాంతి) :**

ప్రజాస్వామ్య విలువలు, ఓటు హక్కు ప్రాముఖ్యతపై అందరూ అవగాహన కలిగి ఉండాలని భువనగిరి తహసీల్దారు అంజిరెడ్డి అన్నారు. 16వ జాతీయ ఓటర్ల దినోత్సవం సందర్భంగా భువనగిరి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఆయన విద్యార్థులకు ఓటు హక్కు గురించి వివరించారు. భారత పౌరులందరూ, ప్రజాస్వామ్యంపై స్థిరమైన విశ్వాసం కలిగి, దేశ ప్రజాస్వామ్య సంప్రదాయాలను మరియు స్వేచ్ఛా, న్యాయమైన మరియు శాంతియుత ఎన్నికల గౌరవాన్ని నిలబెట్టుకుంటామని ప్రతిజ్ఞ చేయించారు. మతం, జాతి, కులం, కమ్యూనిటీ, భాష లేదా ఏదైనా ఇతర ప్రేరేపణల ప్రభావానికి లోనవకుండా ప్రతి ఎన్నికలో నిర్భయంగా ఓటు వేయాలని విద్యార్థుల చేత ఓటర్ల ప్రతిజ్ఞ చేయించి మాట్లాడారు. యువతను, ముఖ్యంగా కొత్త ఓటర్లను ఎన్నికల ప్రక్రియలో పాల్గొనేలా ప్రోత్సహించడమే లక్ష్యంగా ఓటరు దినోత్సవం








నిర్వహించడం జరుగుతుందన్నారు. అర్హులైన వారందరూ ఓటరుగా నమోదై ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవాలని నిర్భయంగా, నిష్పక్షపాతంగా ఓటు వేయాలనే సూచించారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ కొమ్మిడి కరుణాకర్ రెడ్డి, మండల గిర్దావర్ మరియు అధ్యాపకులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.

## శిక్షణ తరగతుల్లో కలెక్టర్ నుండి సర్టిఫికెట్ అందుకున్న పాపన్నపేట సర్పంచ్ పావని నరేందర్ గౌడ్



**మెదక్,జనవరి23(పద్మక్రాంతి):**

నూతనంగా గెలుపొందిన సర్పంచులకు రాష్ట్ర ప్రభుత్వం ఈ నెల(19 నుండి 23 వరకు) ఐదు రోజుల శిక్షణ తరగతుల శిబిరాన్ని మెదక్ జిల్లా కేంద్రంలోనీ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో నిర్వహించారు. ఈశిక్షణ శిబిరంలో ఐదు రోజులుగా క్రమం తప్పకుండా హాజరై పంచాయతీరాజ్ జిల్లా అధికారులు వివరించిన గ్రామం యొక్క అభివృద్ధి, గ్రామంలో పారిశుద్ధ కార్యక్రమాలు, నిరక్షరాస్యతను నిర్మూలించడం, అక్షరాస్యతను పెంపొందించడం, పేదరిక నిర్మూలన,ప్రభుత్వ సంక్షేమ పథకాల ద్వారా గ్రామంలో అన్ని వర్గాల వారికి అవకాశాలు అందిపుచ్చడంలో వివిధ రకాల మౌలిక వసతులు వంటి విషయాలను చాలా క్షుణ్ణంగా వివరించారు. శుక్రవారం రోజు శిక్షణ శిబిరం ముగింపు సందర్భంగా శిక్షణలో భాగంగా జిల్లాకలెక్టర్ రాహుల్ రాజ్ నుండి సర్టిఫికెట్ అందుకున్న లింగంపేట పావని నరేందర్ గౌడ్ మాట్లాడుతూ ఈ శిక్షణలో చాలా చాలా తెలియనీ విషయాలు తెలుసుకుని వారి వారి అనుభవాలను సభాముఖంగా వెల్లడించినట్లు ఆమె పేర్కొన్నారు.

## గీత కార్మిక సొసైటీ సంఘం నూతన అధ్యక్షులుగా నక్క శివలింగం గౌడ్


**ఇబ్రహీంపట్నం ప్రతినిధి,జనవరి 23, (పద్మక్రాంతి ):**



అబ్దుల్లాపూర్మెట్ మండలం తొర్రూరు గ్రామంలో శుక్రవారం గీత కార్మిక సొసైటీ సంఘం నూతన అధ్యక్ష ఎన్నిక జరిగింది. ఎన్నికలో మాజీ వార్డు సభ్యులు నక్క శివలింగం ని ఏకగ్రీవంగా గ్రామస్తులు ఎన్నుకున్నారు. డైరెక్టర్ కో-ఆపరేటివ్ ఇన్స్పెక్టర్ వెంకట రాఘవ ఆధ్వర్యంలో నూతన ఎన్నిక జరిగింది. ఈ సందర్భంగా నూతన అధ్యక్షుడు శివలింగం మాట్లాడుతూ.. నాపై నమ్మకంతో ఎన్నుకున్న సభ్యులకు, కుల సభ్యులకు ఎల్లవేళలా పనిచేస్తానని, ప్రభుత్వ పథకాలను ఎప్పటికప్పుడు తమ గౌడ కులస్తులకు స్థానిక ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి సహాయంతో ప్రతి కుటుంబానికి చేరవేస్తానని అన్నారు. ఈ అవకాశం నాకు ఇచ్చినందుకు ప్రతి ఒక్కరికి రుణపడి ఉంటానని తెలిపారు. ఈ కార్యక్రమంలో నక్క ప్రవీణ్,వైస్ చైర్మన్ బాలగోని శ్రీనివాస్,సెక్రటరీ నక్క కొండల,డైరెక్టర్,గౌని నవీన్ కుమార్,

## సరస్వతీ మాత గా .. వనదుర్గమ్మ





**పాపన్నపేట, జనవరి 23 (పద్మక్రాంతి)**

ప్రసిద్ధ పుణ్యక్షేత్రం మెదక్ జిల్లా ఏడుపాయల వనదుర్గమ్మ ఆలయం. శుక్రవారం (శ్రీ పంచమి) వసంత పంచమిని పురస్కరించుకొని వనదుర్గమ్మ..సరస్వతీ మాత గా భక్తులకు దర్శనమిచ్చింది. అర్చకులు అమ్మవారిని పుస్తకాలు, పెన్నులు,వీణ, వివిధ రకాల పుష్పాలతో రూపంలో సుందరంగా అలంకరించి, విశేష పూజలు నిర్వహించారు

RNI No : TELTEL/2022/85167
పద్మక్రాంతి
(వాస్తవాలు వెలుగులోకి) తెలుగు దినపత్రిక

# అన్నివర్గాలకు బ్యాంకర్లు రుణాలు ఇవ్వాలి

- ప్రైవేట్ వ్యక్తుల జోలికి వెళ్లకుండా చూడాలి
- చిన్నతరహా పరిశ్రమలు, డ్వాక్రాలకు రుణాలు అందాలి
- రుణాల రీ షెడ్యూల్ అవకాశాన్ని వినియోగించుకోవాలి
- ప్రకృతి సేద్యం చేసే వారికి విరివిగా రుణాలు ఇవ్వండి
- బ్యాంకర్ల స్థాయి మీటింగ్‌లో కలెక్టర్లను కూడా ఆహ్వానించాలి
- రాష్ట్రస్థాయి బ్యాంకర్ల సమావేశంలో సీఎం చంద్రబాబు

**అమరావతి,జనవరి23(పద్మక్రాంతి):**





రుణాల రీషెడ్యూల్‌తో రూ.1,108 కోట్ల మేర ఆదా చేయగలిగామని ఏపీ సీఎం చంద్రబాబు తెలిపారు. ఎంఎస్ఎంఈలు, వివిధ కీలక రంగాలు అభివృద్ధి జరిగేలా బ్యాంకర్ల సహకారం అందించాలని కోరారు. వ్యాపారాల్లో బలహీనవర్గాలకు చేయూతనిచ్చే ఎంఎస్ఎంఈలకు ఎక్కువ ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. అమరావతిలో బ్యాంకర్లతో నిర్వహించిన సమావేశంలో సీఎం మాట్లాడారు. ఎంఎస్ఎంఈలకు ప్రభుత్వం, బ్యాంకర్లే వెన్నుదన్నుగా నిలవాల్సిన అవసరముంది. వాటి పోత్సాహంతో అన్ని రంగాల్లో అభివృద్ధి సాధ్యమవుతుంది. వైకాపా పాలనలో వ్యవస్థలు గాడి తప్పి ప్రభుత్వానికి క్రెడిబులిటీ పోయింది. పెద్ద ఎత్తున వడ్డీలకు అప్పులు తెచ్చారు. క్రెడిబులిటీ ఉంటే తక్కువ వడ్డీలకు రుణాల తీసుకురావొచ్చు. రాష్ట్రంలో 2 లక్షల కోట్ల మేర రుణాలను రీషెడ్యూల్ చేసుకునే అవకాశం ఉందని అంచనా వేశామని అన్నారు. ఇప్పటి వరకు రూ.49వేలకోట్లు రీషెడ్యూల్ చేశాం. ప్రకృతి సేద్యం మరింత విస్తరించేందుకు బ్యాంకర్ల నుంచి ప్రోత్సాహం అందాలి. ఇకపై బ్యాంకర్ల సమావేశానికి జిల్లా కలెక్టర్లను కూడా ఆహ్వానించాలని చంద్రబాబు సూచించారు. ఈ సమావేశంలో అధికారులకు సీఎం చంద్రబాబు పలు కీలక అంశాలపై దిశానిర్దేశర చేశారు. వివిధ రంగాలకు ఇచ్చే రుణాలపై సీఎం చంద్రబాబు సమీక్షించారు. ఈ సందర్భంగా చంద్రబాబు మాట్లాడుతూ.. రాష్ట్రంలో ఏ ఒక్కరూ ప్రైవేట్ వ్యక్తుల వద్ద రుణాలు తీసుకునే పరిస్థితి ఉండకూడదన్నారు. వ్యవసాయం సహా ఏ అవసరం వచ్చినా బ్యాంకుల వద్దకు వెళ్లి రుణాలు తీసుకునే పరిస్థితి రావాలని.. బ్యాంకర్లు ఆ దిశగా పని చేయాలని మార్గనిర్దేశం చేశారు. రెన్యూవబుల్ ఎనర్జీ రంగానికి బ్యాంకర్లు విరివిగా రుణాలు ఇవ్వాలని సూచించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రెన్యూవబుల్ ఎనర్జీకి ఎక్కువగా ప్రాధాన్యం ఇస్తున్నాయని వెల్లడించారు. డిస్కంలు కూడా కౌంటర్ గ్యారంటీ ఇస్తున్నాయని.. రెన్యూవబుల్ ఎనర్జీ రంగానికి బ్యాంకర్లు ఇచ్చే రుణాలపై మరింత చొరవ చూపాలని దిశానిర్దేశర చేశారు. ఎస్సీ, ఎస్టీ, బీసీలకు రుణాలు పెద్దఎత్తున ఇవ్వాలని..అప్పుడే అన్నిరంగాల్లో వారు ఎదుగుతారని చెప్పుకొచ్చారు. వారికోసం ప్రభుత్వం చేయాల్సింది చేస్తోందని.. బ్యాంకర్ల వైపు నుంచీ సహకారం ఉండాల్సిందేనని స్పష్టం చేశారు. అభివృద్ధి ఫలాలు అందరికీ అందాలని.. పేద, ధనికుల మధ్య తారతమ్యాలు పోవాలని సూచించారు. రాజధాని అమరావతిని ఫైనాన్స్ సంస్థలకు కేంద్రంగా చేయాలని భావిస్తున్నామని వ్యాఖ్యానించారు. బ్యాంకులతో సహా వివిధ ఆర్థిక రంగ సంస్థలు కార్యాలయాలను ఏర్పాటు చేస్తున్నాయని సీఎం వివరించారు. ఇటీవలే 15 బ్యాంకుల కార్యాలయాల ఏర్పాటుకు శంకుస్థాపన చేశామని.. సంబంధిత నిర్మాణాలు మరింత ఊపందుకుని త్వరితగతిన పూర్తి కావాలని సూచించారు సీఎం. డ్వాక్రా సంఘాలను బలోపేతం చేసిన విధంగానే.. ఫార్మర్ ప్రొడ్యూసర్స్ ఆర్గనైజేషన్లను బలోపేతం చేయాలని మార్గనిర్దేశర చేశారు. టిడ్కో ఇళ్ల విషయంలో జగన్ ప్రభుత్వం ఇచ్చిన హామీ అమలు చేయకపోవడం వల్ల లబ్దిదారులు ఇబ్బందులు పడుతున్నారని చెప్పుకొచ్చారు. ఇప్పుడు ఆ టిడ్కో ఇళ్లకు రుణాలు ఇచ్చేందుకు కూడా బ్యాంకర్లు అంగీకరించడం లేదని తెలిపారు. ఈ సమస్య పరిష్కారానికి తమ వైపు నుంచి ప్రయత్నిస్తున్నామని.. బ్యాంకర్లు కూడా సహకరించాలని ముఖ్యమంత్రి కోరారు. డ్వాక్రా గ్రూపు బ్యాంక్ ఖాతాలపై 15 రకాల ఛార్జీలు వేస్తున్నారని, బ్యాంకర్లు ఈ ఛార్జీలను తగ్గించాలన్నారు. భూ రికార్డులను ప్రక్షాళన చేస్తున్నామని.. వైసీపీ ప్రభుత్వం 22ఏ పేరుతో భూ వివాదాలు సృష్టించిందని ప్రస్తావించారు. ఇప్పుడీ భూ రికార్డులకు పూర్తి స్థాయిలో భద్రత కల్పిస్తున్నామని తెలిపారు. క్యూఆర్ కోడ్‌తో కూడిన పట్టాదార్ పాస్ పుస్తకాలు ఇస్తున్నామని తెలిపారు. బ్యాంకర్లు కూడా బ్యాంక్ ఖాతాల కోసం క్యూఆర్ కోడ్ విధానాన్ని ప్రవేశపెడితే బాగుంటుందేమో ఆలోచించాలని సీఎం చంద్రబాబు పేర్కొన్నారు. ఇదిలావుంటే దావోస్ పర్యటన ముగించుకుని శుక్రవారం అమరావతికి చేరుకున్న ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు. వచ్చీరాగానే నేరుగా సచివాలయానికి చేరుకుని రాష్ట్ర స్థాయి బ్యాంకర్ల కమిటీ సమావేశానికి హాజరయ్యారు. వార్షిక రుణ ప్రణాళికలో భాగంగా ఇప్పటి వరకు వ్యవసాయం, అనుబంధ రంగాలకు రూ.2.96 లక్షల కోట్ల మేర రుణాలను బ్యాంకర్లు అందజేశారు. అలాగే కౌలు రైతులకు రూ.1,490 కోట్ల మేర వ్యవసాయ రుణాలిచ్చారు. ఎంఎస్ఎంఈలకు రూ. 95,714 కోట్ల మేర రుణాలను బ్యాంకర్లు జారీచేశారు. ఈ సమావేశంలో అమరావతిని ఫైనాన్షియల్ హబ్‌గా తీర్చిదిద్దే అంశంపై సీఎం చంద్రబాబు చర్చించారు. రాజధానిలో సెంట్రల్ బిజినెస్ డిస్ట్రిక్ట్ ఏర్పాటుపై బ్యాంకర్లతో చంద్రబాబు సమాలోచనలు జరిపారు.అంతేకాకుండా.. ఏపీ టిడ్కో రుణాలు, డ్వాక్రా సంఘాల లింకేజీ, కేంద్ర పథకాలు, స్టార్టప్‌లకు బ్యాంకుల సహకారం వంటి కీలక అంశాలపై సీఎం సమీక్షించారు. ఈ సమావేశానికి మంత్రులు పయ్యావుల కేశవ్, కొండపల్లి శ్రీనివాస్, చీఫ్ సెక్రెటరీ విజయానంద్, యూనియన్ బ్యాంక్ ఎండీ, ఆర్‌బీఐ ప్రాంతీయ డైరెక్టర్, నాబార్డు జీఎం తదితరులు హాజరయ్యారు. అలాగే వివిధ బ్యాంకుల ప్రతినిధులు, జాతీయ ఎస్సీ, ఎస్టీ కమిషన్ డైరెక్టర్లు కూడా ఈ సమావేశంలో పాల్గొన్నారు.

# నారా లోకేశ్ జన్మదినోత్సవం

- శుభాకాంక్షలు తెలిపిన మంత్రులు తదితరులు



**అమరావతి,జనవరి23(పద్మక్రాంతి):**

ఏపీ మంత్రి నారా లోకేశ్ పుట్టినరోజు సందర్భంగా ఆయనకు శుభాకాంక్షలు వెల్లువెత్తాయి. మంత్రులు, ఎమ్మెల్యేలు, ఇతర ప్రజాప్రతినిధులు ఆయన బర్త్‌డే విషెస్ తెలిపారు. మంత్రులు అచ్చెన్నాయుడు, అనిత, సంధ్యారాణి, వాసంశెట్టి సుభాష్, నిమ్మల రామానాయుడు, కొల్లు రవీంద్ర, గొట్టిపాటి రవి కుమార్, అనగాని సత్యప్రసాద్, డీఎస్‌బీవీ స్వామి, నారాయణ, పయ్యావుల కేశవ్, మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి, సవిత, బీసీ జనార్ధన్ రెడ్డి తదితరులు లోకేశ్‌కు శుభాకాంక్షలు చెప్పారు. విద్యా రంగంలో ఆయన విప్లవాత్మకమార్పులు తీసుకొచ్చారని కితాబిచ్చారు. రాష్ట్రానికి పెద్ద ఎత్తున పెట్టుబడులు తెచ్చేందుకు, ఐటీ సంస్థల స్థాపనకు నిరంతరం కృషి చేస్తున్నారన్నారు. డిప్యూటి సిఎం పవన్ కళ్యాణ్ ప్రత్యేకంగా అభినందనలు తెలిపారు.

# తెలుగు మాట్లాడితేనే ఉద్యోగం నిబంధన రావాలి

- మాజీ ఉప రాష్ట్రపతి వెంకయ్యనాయుడు





**గుంటూరు,జనవరి23(పద్మక్రాంతి):**

తెలుగులో మాట్లాడితేనే ప్రభుత్వ ఉద్యోగం అనే ఉత్తర్వులు తీసుకురావాలని మాజీ ఉప రాష్ట్రపతి వెంకయ్యనాయుడు అన్నారు. అప్పుడే అందరూ మాతృభాషను గౌరవిస్తారని చెప్పారు. ప్రభుత్వం విద్య, వైద్యం ఉచితంగా అందించాలన్నారు. శుక్రవారం మంగళగిరిలో పర్యటించిన ఆయన.. మాజీ మంత్రి కామినేని శ్రీనివాస్‌తో కలిసి ఎన్నారై ఆసుపత్రిలో నూతనంగా ఏర్పాటు చేసిన ల్యాబ్‌ను ప్రారంభించారు. అనంతరం నూతన భవన నిర్మాణాలకు భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా వెంకయ్యనాయుడు మాట్లాడుతూ.. తెలుగు భాష కోసం కృషి చేసిన వారిని కొనియాడారు.

రామోజీరావు ఈనాడు పత్రిక ద్వారా తెలుగు భాష కోసం ఎంతో కృషి చేశారని అన్నారు. అందుకోసం ఆయన రెండు నిఘంటువులను రూపొందించినట్లు చెపారు. రానున్న రోజుల్లో సాంకేతిక విద్యను మాతృభాషలో అందిస్తారని చెప్పారు. అంతేకాదు వైద్యులు రోగులతో ఆప్యాయంగా మాట్లాడాలన్నారు. వారికి సమయం కేటాయించి అవసరమైతేనే స్కానింగ్, ఇతర పరీక్షలు చేయాలని సూచించారు. తన తల్లి కోరిక మేరకు తాను న్యాయవాది అయినట్లు ఈ సందర్భంగా చెప్పారు. పీపీపీ విధానంలో ఎలాంటి తప్పులు లేవని,. ఇది చాలా మంచి పద్ధతి అని మాజీ మంత్రి కామినేని శ్రీనివాస్ తెలిపారు. ఇందులో ఎలాంటి లోపాలు లేవన్నారు. ప్రైవేటు వైద్య కళాశాలలు వస్తేనే ఎక్కువ మంది వైద్యులు అందుబాటులోకి వస్తారని చెప్పారు.

# కల్తీ నెయ్యి కేసులో సిట్ ఛార్జ్‌షీట్ దాఖలు

- మొత్తం 36మంది నిందితుల పేర్లు నమోదు
- నిందితుల్లో 12మంది టిటిడి ఉద్యోగులు

**అమరావతి,జనవరి23(పద్మక్రాంతి):**



తిరుమల శ్రీవారి ప్రసాదమైన లడ్డూ తయారీలో ఉపయోగించిన కల్తీ నెయ్యి కేసులో సీబీఐ ఆధ్వర్యంలోని స్పెషల్ ఇన్వెస్టిగేషన్ టీమ్తుది ఛార్జ్‌షీట్‌ను దాఖలు చేసింది. ఈ కేసులో 2019 నుంచి 2024 వరకు జరిగిన అవినీతి, కల్తీపై దర్యాప్తు చేపట్టిన సిట్.. మొత్తం 36 మందిని నిందితులుగా చేర్చింది. వీరిలో 12 మంది తిరుమల తిరుపతి దేవస్థానం(టీటీడీ) ఉద్యోగులూ ఉన్నారు. టీటీడీ మాజీ ఛైర్మన్ వైవీ.సుబ్బారెడ్డి పీఏ చిన్న అప్పన్న కూడా ఉన్నారు. ఇంకా 11 మంది టీటీడీ ఉద్యోగులను నిందితులుగా చేర్చడానికి టీటీడీ ఉన్నతాధికారులు అనుమతి ఇచ్చారు. ఎవరెవరికి ఎంత కమీషన్లు వెళ్లాయనే సమాచారంతో పాటు లావాదేవీల వివరాలనూ సిట్ సేకరించినట్లు తెలుస్తోంది. నిబంధనలు మార్చడం వెనుక ఎవరున్నారనే అంశాలపైనా ఛార్జ్‌షీట్‌లో సిట్ పేర్కొన్నట్టు సమాచారం.దర్యాప్తులో వెల్లడైన వివరాల ప్రకారం.. 2019 నుంచి 2024 వరకు లడ్డూ తయారీకి రూ.235 కోట్ల విలువైన 60 లక్షల కిలోల కల్తీ నెయ్యిని ఉపయోగించారని సిట్.. నిగ్గు తేల్చినట్టు ప్రచారం జరుగుతోంది. నెయ్యి సరఫరా కాంట్రాక్ట్ తమిళనాడులోని ఏఆర్ డెయిరీకి ఇచ్చినప్పటికీ, సబ్ కాంట్రాక్ట్ తీసుకున్న ఉత్తరాఖండ్‌కు చెందిన భోలేబాబా డెయిరీ కీలక పాత్ర పోషించిందని సిట్ తన దర్యాప్తులో వెల్లడించింది. భోలేబాబా డెయిరీ యజమానులు కీలక సూత్రధారులుగా వ్యవహరించినట్టు సిట్ నిర్ధారణకు వచ్చినట్లు సమాచారం.భోలేబాబా డెయిరీలో అసలు పాలు, నెయ్యి ఉత్పత్తి లేకపోయినా.. టీటీడీ అధికారులు నెయ్యి నాణ్యత బాగుందని నివేదికలు ఇచ్చారని.. తిరుమలకు వచ్చిన ట్యాంకర్లలో నెయ్యి నాణ్యతను సరిగా పరీక్షించలేదని సిట్ తేల్చింది. ఫలితంగా శ్రీవారి ప్రసాదం లడ్డూ నాణ్యత దెబ్బతిన్నదని.. అప్పట్లో భక్తులు దీనిపై ఫిర్యాదులు చేసినా పట్టించుకోలేదని సిట్ పేర్కొంది.

# నిర్వాసితులకు నష్టపరిహారం చెల్లిస్తాం

- ఆ తరవాతే ప్రాజెక్ట్ పూర్తి చేసి ప్రారంభిస్తాం
- వెలిగొండ ప్రాజెక్టును పరిశీలించిన మంత్రి నిమ్మల

**ఒంగోలు,జనవరి23(పద్మక్రాంతి):**



నిర్వాసితులకు నష్టపరిహారం అందించిన తరువాతే, వెలిగొండ ప్రాజెక్టును పూర్తి చేసి జాతికి అంకితం చేస్తామని జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు అన్నారు. శుక్రవారం వెలిగొండ ప్రాజెక్టు టన్నెల్, ఫీడర్ కెనాల్ పనులను మంత్రి నిమ్మల రామానాయుడు పరిశీలించారు. ఫీడర్ కెనాల్ వెంట నడుచుకుంటూ లైనింగ్, రిటైనింగ్ వాల్ పనులను పరిశీలించారు. అనంతరం మీడియాతో నిమ్మల.రామానాయుడు మాట్లాడుతూ ?. వారం రోజులలో సిఎం చంద్రబాబు వెలిగొండ ప్రాజెక్టు పనులను స్వయంగా పర్యవేక్షించి, సమీక్ష చేపడతారు అని వెల్లడించారు. రూ.456 కోట్లతో చేపట్టిన ఫీడర్ కెనాల్ లైనింగ్, 5.3 కి.మీ రిటైనింగ్ వాల్ కాంక్రీట్ పనులకు చంద్రబాబు భూమి పూజ చేస్తారని తెలిపారు. ఈ ఏడాది సీజన్ మొదలయ్యేలోగా నల్లమల సాగర్ రిజర్వాయర్ నింపే లక్ష్యంతో పనులు జరుగుతున్నాయన్నారు. 5 ఏళ్ళ జగన్ పాలనలో టన్నెల్-2లో 745 మీటర్లు బెంచింగ్, 705 మీటర్లు లైనింగ్, మాత్రమే చేశారని విమర్శించారు. కూటమి ప్రభుత్వంలో 18 నెలల్లోనే 6579 మీటర్ల బెంచింగ్ పనులు, 3644 మీటర్ల లైనింగ్ పూర్తి చేశామన్నారు. గత ప్రభుత్వం 5 ఏళ్ళలో బెంచింగ్ 745 మీటర్లు చేస్తే, కూటమి ప్రభుత్వం లో 18 నెలల్లోనే 6,579 మీటర్లు పూర్తి చేశాం అని చెప్పారు. డిసెంబర్ లో 504 మీటర్లు, జనవరిలో 312 మీటర్లు, మొత్తంగా 816 మీటర్ల లైనింగ్ పనులు చేశామని చెప్పారు. వైసిపి ప్రభుత్వం 5 ఏళ్ళలో చేసిన లైనింగ్ పనిని, తాము 50 రోజుల్లోనే చేసి చూపించామన్నారు. ప్రభుత్వం నుండి అనుమతులు రాగానే టన్నెల్-2లో టిబిఎం మెషిన్ తొలగింపు పనులు మొదలుపెడతామన్నారు. ఫీడర్ కెనాల్ లో 10 క్యూసెక్కుల నీరు వెళ్ళినా గట్లు తెగిపోయి, గ్రామాలు మునిగిపోతాయని నిపుణుల కమిటీ చెప్పినా, వైసిపి ప్రభుత్వం పట్టించుకోలేదు అని అన్నారు. నేడు వెలిగొండ ఫీడర్ కెనాల్ కు చంద్రబాబు భూమి పూజ చేస్తుంటే నాడు పూర్తయినట్లుగా జాతికి అంకితం అంటూ మోసం, దగా చేశారు అని మంత్రి ధ్వజమెత్తారు. కూటమి ప్రభుత్వం రూ.456 కోట్లతో ఫీడర్ కెనాల్ లైనింగ్, రిటైనింగ్ వాల్ పనులు మొదలుపెట్టి, జూన్ నాటికి పూర్తిచేయబోతుందని ప్రకటించారు. నిర్వాసితులకు నష్టపరిహారం అందించిన తరువాతే, వెలిగొండ ప్రాజెక్టును పూర్తి చేసి జాతికి అంకితం చేస్తామన్నారు. చుక్కనీరు ఇవ్వకుండా, జాతికి అంకితం అంటూ? ప్రకాశం జిల్లా రైతులను మోసం చేసి, జగన్ చరిత్రలో సరిదిద్దుకోలేని తప్పిదం చేశారని మంత్రి నిమ్మల.రామానాయుడు దుమ్మెత్తిపోశారు.

# ప్రజావ్యతిరేక చట్టాలపై పోరాటం

- పాత ఉపాధి చట్టాన్ని కొనసాగించాలి
- విబిజి రాంజీ తో పేదలకు కష్టాలు తప్పవు
- 30న రాష్ట్రవ్యాప్తంగా నిరసనలు సాగిస్తాం
- సిపిఎం పోలిట్ బ్యూరో సభ్యుడు బివి రాఘవులు హెచ్చరిక

**విజయవాడ,జనవరి23(పద్మక్రాంతి):**




మోడీ ప్రభుత్వం ప్రజలు ఆలోచించేలోపే వేగంగా నిరంకుశ చట్టాలను అమల్లోకి తెస్తోందని, ఇందులో భాగంగానే విబిజీరాంజీ, విద్యుత్ చట్టాల సవరణ, లేబర్ కోడ్లు, సీడ్ బిల్లు, మినీ అణువిద్యుత్ ప్లాంటు బిల్లులను ఒకేసారి తీసుకోస్తోందని సిపిఎం పొలిట్‌బ్యూరో సభ్యులు బి.వి.రాఘవులు అన్నారు. శుక్రవారం ఉదయం విజయవాడ బాలోత్సవ భవనంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో పార్టీ రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావుతో కలిసి రాఘవులు మాట్లాడారు. ఈనెల 16 నుండి 18వ తేదీ వరకు కేరళలో సిపిఎం కేంద్ర కమిటీ సమావేశాలు జరిగాయని, 22, 23 తేదీల్లో సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సమావేశాలు విజయవాడలో జరిగాయని వీటిల్లో పలు కీలక అంశాలపైనా, ప్రమాదకరమైన సంస్కరణలపైనా చర్చించినట్లు తెలిపారు. గతంలో ఉన్న ఉపాధి హామీ చట్టాన్నే అమలు చేయాలని కోరుతూ ఈ నెల 30వ తేదీ నుండి ఫిబ్రవరి 5వ తేదీ వరకూ ఇంటింటి ప్రచారం నిర్వహిస్తామని తెలిపారు. జనవరి 30 మహాత్మా గాంధీ వర్ధంతి సందర్భంగా ఉపాధి హామీ చట్టం పరిరక్షణకు పోరాడతామని ప్రతిజ్ఞ చేసామని, రెండో తేదీ వరకూ సంతకాల సేకరణ చేసి గ్రామ సచివాలయాల్లో మహజర్లు సమర్పిస్తామని, ఐదో తేదీ వరకూ విస్తృత ప్రచారం చేసి 5న అన్ని మండల కార్యాలయాల ముందు ధర్నాలు నిర్వహిస్తామని వారు తెలిపారు. విబిజీరాంజీతో ప్రజలకు తీవ్ర హాని జరుగుతుందని, కేంద్రం తనకు నచ్చిన రాష్ట్రాలకు నిధులిచ్చుకునే విధంగా చట్టంలో మార్పులు చేర్పులు చేసిందని, పనిదినాల్లోనూ కోత పెట్టిందని అన్నారు. చట్టం అమల్లోకి వస్తే రాష్ట్రాలు అప్పుల పాలవుతాయని అన్నారు. కొత్త పథకం వల్ల దేశంలో సామాజిక న్యాయం పూర్తిగా దెబ్బతిని, దళితులు, పేదలకు తీవ్ర అన్యాయం జరుగుతుందని అన్నారు. విద్యుత్ చట్టానికి సవరణలు చేయడం ద్వారా పేదలకు అందే క్రాస్ సబ్సిడీ రద్దవుతుందని పేర్కొన్నారు. రెగ్యులేటరీ కమిషన్ హక్కులను కూడా కేంద్రం లాగేసుకుంటుందని, పేదలపై మోయలేని భారం పడుతుందని తెలిపారు. వీటితోపాటు ఆస్పత్రులు, విద్యా సంస్థలకు ఇచ్చే సబ్సిడీని ఎత్తేస్తారని అన్నారు. ఏప్రిల్ ఒకటో తేదీ నుండి లేబర్ కోడ్లు అమల్లోకి వస్తాయని చెబుతున్నారని, దీనివల్ల కార్మికులు కనీస హక్కులతోపాటు సమ్మె హక్కునూ కోల్పోతారని, ఎనిమిది గంటల పనివిధానం రద్దవుతుందని అన్నారు. యూనియన్ల కోసం కార్మికులు పోరాటాల ద్వారా సాధించుకున్న హక్కులన్నీ నిర్వీర్యం అవుతాయని తెలిపారు. ప్రమాదకరమైన మినీ న్యూక్లియర్ పవర్ ప్లాంట్లను విదేశీ వ్యక్తులు నేరుగా ఏర్పాటు చేసుకునేలా బిల్లు తెస్తున్నారన్నారు. ఇటువంటి చట్టాలను అత్యంత వేగంగా కేంద్రంలో బిజెపి ప్రభుత్వం అమల్లోకి తెస్తోందని వీటిని సిపిఎం వ్యతిరేకిస్తున్నదని, ప్రజలను చైతన్యం చేసేందుకు

పెద్దఎత్తున ప్రచారం చేస్తామని తెలిపారు. ఈ మేరకు కేంద్ర కమిటీలో నిర్ణయం తీసుకున్నామని చెప్పారు. దేశవ్యాప్తంగా రైతులు నిర్వహిస్తున్న సమ్మెకు సంఘీభావం ప్రకటించారు. సంవత్సరాల తరబడి పెట్టుబడుల పేరుతో ఎపి ముఖ్యమంత్రులు ప్రతి ఏడాది దావోస్ తీర్థయాత్రలకు వెళుతున్నారని రాఘవులు పేర్కొన్నారు. అంతర్జాతీయంగా పెట్టుబడులను దెబ్బతీసే విధంగా ట్రంప్ వ్యవహరిస్తుంటే పెద్దఎత్తున నిధులు వస్తున్నాయని వీరు ప్రచారం చేయడం అవివేకమని తెలిపారు. నిజంగా పెట్టుబడులు వచ్చి ఉంటే రాష్ట్రం ఏడోస్థానంలో ఎందుకుందో చెప్పాలన్నారు. మరోవైపు దేశం, రాష్ట్రం నుండి పెట్టుబడులు వెనక్కుపోతున్నాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. ముఖ్యమంత్రులుగా ఉన్నవారు మిగులు, ఖాళీగా ఉన్న పనికిరాని భూముల్లో పరిశ్రమలు పెట్టకుండా రైతులు సాగులో ఉన్న భూములను మాత్రమే పరిశ్రమలకు కేటాయిస్తూ పేదలు, దళితులు సాగు చేసుకుంటున్న భూములనే బలవంతంగా లాక్కుంటున్నారని వివరించారు. 99 పైసలకే తాము భూములు కేటాయిస్తామని, మా ఇష్టమని మంత్రి లోకేష్ వ్యాఖ్యానించడం అమాయకత్వం, అవివేకమని బి.వి.రాఘవులు అన్నారు. ప్రజాస్వామ్య వ్యవస్థలో ఉన్నామని, రాజరికంలో లేమనే విషయాన్ని గుర్తించాలని హెచ్చరించారు. గతంలో ఇలాగే వ్యవహరించిన వ్యక్తులకు రాష్ట్ర ప్రజలు బుద్ధిచెప్పారనే విషయాన్ని గుర్తించాలన్నారు. ÷ూష్ట్రంలో ముఖ్యమంత్రి, లోకేష్, గతంలో ఉన్న జగన్ వారి పదవులు తప్ప అన్ని పిపిపి చేస్తున్నారని రాఘవులు తెలిపారు. ప్రైవేటీకరణ కంటే పిపిపి అత్యంత ప్రమాకరమైందని, ప్రభుత్వ నిధులతో ప్రైవేటు వ్యక్తులకు లాభాలు కట్టబెట్టడమేనని ఈవిషయంలో వైసిపి, టిడిపి ఒకే విధానాన్ని అనుసరిస్తాయని తెలిపారు. ÷ూష్ట్రంలో గతంలోనూ, ఇప్పుడూ చేసిన, చేస్తామంటున్న పాదయాత్రలు రాజకీయ అధికారం కోసం తప్ప ప్రజల కోసం కాదనే విషయాన్ని ప్రజలు గుర్తించాలన్నారు. దావోస్ పెట్టుబడుల సదస్సుకు గతంలోనూ, ఇప్పుడూ ముఖ్యమంత్రులు ప్రతిఏటా వెళుతున్నా వారి విమాన ఛార్జీల ఖర్చులంత పెట్టుబడులు కూడా రాలేదని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు విమర్శించారు. దావోస్ లో జరిగిన ఎంఓయు లన్నీ కేవలం రియలఎస్టేట్ వ్యాపారం కోసమని పేర్కొన్నారు. 2014 నుండి వచ్చిన చేసుకున్న ఎంఓయులో ఎక్కువ భాగం నిజరూపం దాల్చలేదని, భూములు లాక్కునేందుకు దీన్నో అస్త్రంగా వాడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రజలను వదిలేసి పాలకులు కార్పొరేట్ల చుట్టూ తిరుగుతున్నారని అన్నారు. ప్రజాస్వామ్యాన్ని హత్యచేసి ప్రజల భూములను పెద్దలకు కట్టబెడుతున్నారని అన్నారు. ఈ విషయంలో గత ప్రభుత్వం చేసిన తప్పులనే ఈ ప్రభుత్వమూ కొనసాగిస్తోందని తెలిపారు. నిజంగా పెట్టుబడులు రావాలంటే ప్రజలకు పనికల్పించి వారికి ఆదాయాలు పెంచాలని, అప్పుడు పెట్టుబడులు వాటంతట అవే వస్తాయని అన్నారు. 30వ తేదీ నుండి 5వ తేదీ వరకూ జరిగే నిరసనలకు ప్రభుత్వం దిగిరానిపక్షంలో అవసరమైతే మార్చిలో చలో లోక్‌భవన్ కార్యక్రమం నిర్వహిస్తామని అన్నారు. ఇజ్రాయిల్ టెక్నాలజీ అంటే ప్రజలను మారణహోమం చేయడమేనని శ్రీనివాసరావు పేర్కొన్నారు.

RNI No : TELTEL/2022/85167

పద్మక్రాంతి

(వాస్తవాలు వెలుగులోకి) తెలుగు దినపత్రిక

## హోర్డింగ్ కూలడంతో వ్యక్తికి గాయాలు

ములుగు,జనవరి23(పద్మక్రాంతి):

మేడారంలో అధికారుల నిర్లక్ష్యం భక్తుల ప్రాణాల మీదకు తెచ్చింది. హరిత వై-జంక్షన్ దగ్గర లైటింగ్ నేమ్ బోర్డు ప్రమాదవశాత్తు కిందపడటంతో ఎడ్ల నర్స-య్య అనే భక్తుడికి గాయాల య్యాయి. నేను ప్రమాదంలో చిక్కుకున్న పోలీసులు, అధికారులు మానవమాత్రంగానైనా సాయం చేయలేదని క్షతగాత్రుడు వాపోయాడు. బోర్డు కుప్పకూలడానికి పోలీసులే కారణం. లైటింగ్ నేమ్ బోర్డులో ఇరుకున్న నన్ను పోలీసులు కాపాడలేదని అన్నాడు. నా భార్య బ్రతిమలాడిన అక్కడ ఉన్న పోలీసులు కనికరించలేదన్నారు. బయట వ్యక్తులు 20 మంది వచ్చి నన్ను బయటకి తీసారు.పోలీసులున్నది భక్తుల కోసం కాదా అని నర్సయ్య ప్రశ్నించారు. జాతర నిర్లక్ష్యాన్ని గోప్యంగా ఉంచేందుకు మంత్రాంగం నడుపుతున్న తీరుపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

## మరోమారు ఔదార్యం చాటుకున్న కెసిఆర్

- మెడిసిన్ చదువుకోవడానికి విద్యార్థికి సాయం

గజ్వేల్,జనవరి23(పద్మక్రాంతి):



మాజీ సీఎం, బీఆర్ఎస్ అధినేత కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావు మ-రోసారి ఔదార్యాన్ని చాటారు. బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు, ఉద్యమకారుడు, ములుగు జిల్లా పరిషత్ మాజీ చైర్మన్ కుసుమ జగదీశ్ కుటుంబానికి కేసీఆర్ అండగా నిలిచారు. పార్టీలో మొదటి నుంచి క్రియాశీలకంగా వ్యవహరించిన కుసుమ జగదీశ్ రెండేళ్ల క్రితం అనారోగ్యంతో కన్నుమూశారు. జగదీశ్ కుమార్తె సుకీర్తి మెడిసిన్ చదవడానికి ప్రయత్నిస్తున్న విషయం గురించి కేసీఆర్ పార్టీ నాయకుల ద్వారా తెలుసుకున్నారు. ఆమె మెడిసిన్ చదవడానికి అవసరమైన ఫీజు చెక్కును శుక్రవారం ఎర్రవెల్లి నివాసంలో సుకీర్తికి అందజేశారు. మంచిగా చదువుకోవాలని, ఆమె కుటుంబానికి పార్టీ అండగా ఉంటుందని సుకీర్తిని ఆశీర్వదించారు. సుకీర్తితో పాటు మాజీ ఎమ్మెల్సీ కర్నె ప్రభాకర్ , మాజీ ఎమ్మెల్యే రసమయి బాలకిషన్, ములుగు బీఆర్ఎస్ శ్రేణులు కేసీఆర్‌ను కలిశారు. బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ పార్టీ కార్యకర్తల పట్ల చూపే ఆదరణకు ఈ సంఘటన ఒక నిదర్శనమని ఆ పార్టీ నేతలు తెలిపారు. కుసుమ జగదీశ్ కుటుంబానికి అధినేత అందించిన ఈ ఆర్థిక సహాయం ఆ కుటుంబంలో కొత్త వెలుగును నింపిందని బీఆర్ఎస్ నేతలు పేర్కొన్నారు.

## మదర్ డెయిరీ చైర్మన్ రాజీనామా

నల్లగొండ,జనవరి23(పద్మక్రాంతి):



నార్ముల్ మదర్ డెయిరీ చైర్మన్ గా బాధ్యతలు చేపట్టిన మందడి ప్రభాకర్ రెడ్డి రెండు వారాలు తిరగకముందే తన పదవికి రాజీనామా చేశారు. నల్గండ-రంగారెడ్డి జిల్లాల పాల ఉత్పత్తిదారుల సహకార సంఘం నార్ముల్ మదర్ డెయిరీకి చైర్మన్ గా పనిచేసిన మధుసూదన్ రెడ్డి రాజీనామా చేయడంతో ప్రభాకర్ రెడ్డి ఆ బాధ్యతలు చేపట్టారు. పాడి రైతుల పెండింగ్ బిల్లుల విషయంలో విభేదాల కారణంగానే ప్రభాకర్ రెడ్డి.. చైర్మన్, డైరెక్టర్ పదవులకు రాజీనామా చేసినట్టు తెలుస్తోంది. దీంతో తదుపరి చైర్మన్ ఎవరనే దానిపై ఉత్కంఠ నెలకొంది.

## మిథున్ రెడ్డికి ముగిసిన ఇడి విచారణ

హైదరాబాద్,జనవరి23(పద్మక్రాంతి):



వైసీపీ ఎంపీ మిథున్ రెడ్డిపై ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ నిర్వహించిన విచారణ ముగిసింది. దాదాపు ఏడు గంటల పాటు ఈడీ అధికారులు ఆయనను ప్రశ్నించారు. ఈ విచారణ సందర్భంగా పలు అంశాలపై విచారించిన అధికారులు.. కీలక వివరాలు సేకరించినట్లు సమాచారం.
యితే.. ఏపీ లిక్కర్స్ స్కామ్‌కు సంబంధించిన అంశాలపై కోర్టు ఉత్తర్వులు ఉన్నందున తానేమీ మాట్లాడలేనని మిథున్ రెడ్డి స్పష్టం చేశారు. కాగా.. లిక్కర్స్ స్కామ్‌కు సంబంధించి ఇప్పటికే పలువురు నేతలపై విచారణ కొనసాగుతున్న నేపథ్యంలో ఈడీ దర్యాప్తు మరింత కీలకంగా మారింది.

## మంత్రులను, ఎమ్మెల్యేలను తరిమి కొడుతున్నారు

- చెప్పడానికి..చేయడానికి ఏమీలేక విమర్శలు
- ప్రభుత్వంపై మండిపడ్డ మాజీమంత్రి శ్రీనివాసగౌడ్

హైదరాబాద్,జనవరి23(పద్మక్రాంతి):



రాష్ట్ర ప్రభుత్వానికి చెప్పడానికి, చేయడానికి ఏమీ లేదని మాజీ మంత్రి శ్రీనివాస్ గౌడ్ అన్నారు. మంత్రులు, ఎమ్మెల్యేలను ప్రజలు తరిమికొడుతున్నారని తెలిపారు. బీఆర్ఎస్ బలపరిచిన అభ్యర్థులు సర్పంచ్‌లుగా గెలిచారని పేర్కొన్నారు. నేను చనిపోయే పరిస్థితి వచ్చిందంటూ మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి ఆవేదన వ్యక్తం చేశారని అన్నారు. మున్సిపల్ ఎన్నిలక ముందు డ్రామాలు చేస్తున్నారని మండిపడ్డారు. ఫోన్ ట్యాపింగ్ చేస్తలేమని డీజీపీ చెప్పాలని శ్రీనివాస్ గౌడ్ డిమాండ్ చేశారు. డిపార్ట్‌మెంట్ చేసే పనులకు ప్రభుత్వానికి సంబంధం లేదని స్పష్టం చేశారు. అరాచక శక్తులు రాష్ట్రాన్ని ఏలుతున్నాయని ఆగ్రహం వ్యక్తంచేశారు. కాంగ్రెస్, బీజేపీ కుమ్మక్కయి బీఆర్ఎస్‌ను బద్నాం చేస్తున్నాయని విమర్శించారు.ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేయడం లేదని విమర్శించారు. హామీలు అమలు చేయలేక.. పోలీసులతోనే ప్రభుత్వాన్ని నడిపిస్తున్నారని తెలిపారు. పోలీసులతోనే నామినేషన్లు వేయిస్తున్నారని పేర్కొ?న్నారు. జడ్చర్లలో కాంగ్రెస్ నాయకుడు ఎస్సై గల్లా పట్టుకున్నాడని తెలిపారు. పోలీసులను కొడుతుంటే ప్రజాస్వామ్యం ఎక్కడుందని ప్రశ్నించారు. నిజాయితీగా పనిచేసే పోలీసులను లూప్‌లైన్‌లో పెడుతున్నారని అన్నారు. జీవితాలు త్యాగం చేసి తెలంగాణ రాష్ట్రాన్ని తెచ్చుకున్నామని శ్రీనివాస్ గౌడ్ తెలిపారు. ఇప్పుడు తెలంగాణ ద్రోహులు ఆ వ్యవస్థలను ఆగం చేస్తున్నారని మండిపడ్డారు. మంత్రులు ఓయూ, అశోక్ నగర్ వెళ్లి మాట్లాడే పరిస్థితి లేదని అన్నారు. హైదరాబాద్‌లో మహిళలకు రక్షణ లేదన్నారు.

## మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్ గెలుపు పక్కా

- మంత్రి వివేక్ వెంకటస్వామి ధీమా

సంగారెడ్డి,జనవరి23(పద్మక్రాంతి):




రానున్న మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ గెలుపు పక్కా అని ఉమ్మడి మెదక్ జిల్లా ఇన్చా ర్జి మంత్రి గడ్డం వివేక్వెంకటస్వామి ధీమా వ్యక్తం చేశారు. జూబ్లీహిల్స్ బై పోల్, సర్పంచ్ ఎన్నికల తర్వాత పార్టీ శ్రేణుల్లో కొత్త జోష్ వచ్చిందన్నారు. పటాన్ చెరు నియోజకవర్గం ముత్తంగి, జిన్నారంలో మంత్రి పర్యటించారు. ఇస్నాపూర్, ఇంద్రేశం, గుమ్మడిదల, జిన్నారం, గడ్డపోతారం మున్సిపల్ పరిధిలోని పార్టీ ముఖ్య కార్యకర్తల సమావేశంలో పాల్గొని ప్రసంగించారు. నియోజకవర్గంలో గ్రూపు రాజకీయాలు లేవని, తాను చేయించిన సర్వేలో పార్టీ తప్పక విజయం సాధిస్తుందని తేలిందన్నారు. అభ్యర్థుల ఎంపిక సక్రమంగా జరగాలన్నారు. టికెట్ రాని వారు నిరాశ చెందవద్దని, అలాంటి వారికి భవిష్యత్తులో అవకాశాలు ఉంటాయని హామీ ఇచ్చారు. బీఆర్ఎస్ హయాంలో కాంగ్రెస్ కార్యకర్తలు చాలా ఇబ్బందులు పడ్డారని, అందరూ కలిసి పార్టీ అభ్యర్థులను గెలిచింపుకోవాలన్నారు. కొత్త రేషన్ కార్డుల ఘనత కాంగ్రెస్ పార్టీదేనన్న మంత్రి.. ఇండ్ల విషయంలో గత ప్ర భుత్వం ప్రజల్ని మోసం చేసిందని విమర్శించా రు. ప్రజల దగ్గరకు వెళ్ళినప్పుడు 6 గ్యారంటీల గురించి వివరించాలన్నారు. మహిళలకుకు పెట్రోల్ బంకులు శాంక్షన్ చేయిస్తామన్నారు. ఎదుటి పార్టీ విమర్శలకు గట్టి కౌంటర్‌అవ్వాలని సూచించారు. పఠాన్ చెరులో పోల్ మేనేజమెంట్ సరిగా లేక ఓడిపోయామన్నారు. కార్మికుల వైపే కాంగ్రెస్ పార్టీ ఉందని చెప్పారు.

## హోరాహోరీగా సీఎం కప్ రెండో విడత

- గ్రామీణ స్థాయి పోటీలు విజయవంతం
- మండల పోటీలకు రంగం సిద్ధం

హైదరాబాద్,జనవరి23(పద్మక్రాంతి):




తెలంగాణ ప్రభుత్వ క్రీడా శాఖ ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న సీఎం కప్?2025 రెండో విడతలో భాగంగా మొదటి అంచె గ్రామీణ క్రీడా పోటీలు విజయవంతంగా ముగిశాయి. అన్ని మండల కేంద్రాల్లో ఉత్సాహభరితంగా టార్చ్ రిలేలు నిర్వహించిన అనంతరం, జనవరి 17 నుంచి 22 వరకు రాష్ట్రవ్యాప్తంగా 3105 క్లస్టర్లలో గ్రామీణ స్థాయి పోటీలు నిర్వహించారు. గ్రామీణ స్థాయిలో ప్రతిభ చూపిన క్రీడాకారులు ఇప్పుడు జనవరి 28 నుంచి 31 వరకు జరగనున్న మండల స్థాయి పోటీలకు సిద్ధమవుతున్నారు. గత సంవత్సరం నిర్వహించిన సీఎం కప్?2024 పోటీల్లో దాదాపు మూడు లక్షల మంది యువ క్రీడాకారులు పాల్గొనగా, ఈ ఏడాది ఇప్పటివరకు రెండు లక్షల 65 వేల మందికి పైగా క్రీడాకారులు ఆ÷-లనైన్‌లో నమోదు చేసుకున్నారు. జిల్లా స్థాయి పోటీలు పూర్తయ్యి రాష్ట్ర స్థాయి పోటీలు ప్రారంభమయ్యేలోపు ఈ సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉందని అధికారులు తెలిపారు. సీఎం కప్ పోటీలకు సాంకేతిక సహకారంగా ఏఐ చాట్‌బాట్, వాట్సాప్ చాట్, ప్రత్యేక వెబ్‌సైట్, అలాగే క్రీడాకారుల సందేహాల నివృత్తికి 24 గంటల ఫోన్ లైన్లు అందుబాటులో ఉంచడం ద్వారా సమర్థవంతమైన సమాచార సమన్వయం జరుగుతోందని పేర్కొన్నారు. దీనివల్ల మరింత మంది క్రీడాకారులు పోటీలకు నమోదు చేసుకునే అవకాశం ఉందన్నారు. గ్రామ స్థాయి పోటీల నిర్వహణలో వ్యాయామ ఉపాధ్యాయులు, ఫిజికల్ డైరెక్టర్లు, అలాగే మండల స్థాయి వివిధ శాఖల అధికారుల సమన్వయంతో పోటీలు సజావుగా ముగిశాయని అధికారులు తెలిపారు. ఇదే ఉత్సాహంతో మండల స్థాయి పోటీలను కూడా విజయవంతంగా నిర్వహిస్తామని వారు వెల్లడించారు.

## ఫోన్ ట్యాపింగ్‌లో ముగిసిన కెటిఆర్ విచారణ

- దాదాపు 7 గంటలపై పలు రకాలుగా ప్రశ్నలు

హైదరాబాద్,జనవరి23(పద్మక్రాంతి):



ఫోన్ ట్యాపింగ్ కేసులో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ విచారణ ముగిసింది. శుక్రవారం ఉదయం 11 గంటల నుంచి దాదాపు 7 గంటల పాటు జూబ్లీహిల్స్ పోలీస్ స్టేషన్‌లో సిట్ అధికారులు ఆయనను ప్రశ్నించారు. 2023 తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల సమయంలో బీఆర్ఎస్ పార్టీకి వచ్చిన విరాళాలు, ఎలక్టోరల్ బాండ్లు.. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో కొందరు వ్యాపారవేత్తలు, రాజకీయ నేతల ఫోన్ల ట్యాపింగ్‌కు సంబంధించి కేటీఆర్‌పై అధికారులు ప్రశ్నల వర్షం కురిపించినట్లు తెలిసింది. అలాగే ఈ కేసులో నిందితుడు, టాస్క్‌ఫోర్స్ మాజీ డీసీపీ రాధాకిషన్ రావు, కేటీఆర్‌ను కలిపి గంట పాటు విచారణ చేసినట్లు సమాచారం. సిట్ విచారణ అనంతరం కేటీఆర్ నేరుగా తెలంగాణ భవన్‌కు వెళ్లారు. ఫోన్ ట్యాపింగ్ కేసులో బీఆర్ఎస్ అగ్రనేతలు హరీష్ రావు, కేటీఆర్ విచారణ ముగియడంతో తదుపరి వంతు కేసీఆర్‌దేనని రాజకీయవరగాల్లో జోరుగా ప్రచారం జరుగుతోంది. సంచలనం సృష్టించిన ఫోన్ ట్యాపింగ్ కేసులో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్‌కు 22 సిట్ నోటీసులు జారీ చేసిన సంగతి తెలిసిందే. ఈ మేరకు జూబ్లీహిల్స్ నందినగర్‌లోని కేటీఆర్ నివాసానికి వెళ్లి అధికారులు నోటీసులు అందజేశారు.

## నిరాధార ఆరోపణలతో పరువుకు భంగం

- మాజీ ఎమ్మెల్యే మెతకు ఆనంద్‌కు స్పీకర్ నోటీసులు



వికారాబాద్,జనవరి23(పద్మక్రాంతి):

వికారాబాద్ మాజీ శాసనసభ్యులు, బీఆర్ఎస్ పార్టీ వికారాబాద్ అధ్యక్షుడు వె-ంతుకు ఆనంద్‌కు తెలంగాణ రాష్ట్ర శాసన సభాపతి గడ్డం ప్రసాద్ కుమార్ లీగల్ నోటీసులు పంపారు. తన న్యాయవాది ద్వారా ఈ నోటీసులు పంపిన స్పీకర్.. పలు అంశాలను అందులో ప్రస్తావించారు. ఆనంద్ తనపై నిరాధార ఆరోపణలు చేసి వ్యక్తిగత ప్రతిష్ఠకు భంగం కలిగించారని తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. మానసికంగా క్షోభ పెట్టినందుకు మాజీ ఎమ్మెల్యే రూ.10కోట్ల నష్ట పరిహారం చెల్లించాలని స్పీకర్ నోటీసుల్లో పేర్కొన్నారు. అలాగే వారం రోజుల్లో బహిరంగంగా తనకు క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు. లేకపోతే చట్టం ప్రకారం.. న్యాయస్థానాల ద్వారా తగు చర్యలు తీసుకుంటానని హెచ్చరించారు. మెతుకు ఆనంద్ ఈ ఏడాది జనవరి 14, 19 తేదీల్లో మీడియా సమావేశం ఏర్పాటు చేసి.. తనపై నిరాధార, తప్పుడు, అసత్య, అభూత కల్పనలు, కట్టు కథలతో కూడిన అవినీతి ఆరోపణలతో పాటు చేశారని ధ్వజమెత్తారు. తన వ్యక్తిగత జీవితానికి, గౌరవానికి భంగం కలిగించే విధంగా ఆ వ్యాఖ్యలున్నాయని స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ నోటీసుల్లో వివరించారు.

## సీతక్క పర్యటనలో ఉద్రిక్తత

- కాంగ్రెస్, బిఆర్ఎస్ శ్రేణుల మధ్య తోపులాట

జనగామ,జనవరి23(పద్మక్రాంతి):



జనగామలో పంచాయతీరాజ్‌శాఖ మంత్రి సీతక్క పర్యటనలో తీవ్ర ఉద్రిక్తత చోటు చేసుకుంది. పలు అభివృద్ధి పనులకు ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనల సందర్భంగా.. కాంగ్రెస్, బీఆర్ఎస్ నేతల మధ్య వాగ్వాదం, తోపులాట జరిగింది. పెంబర్తి క్రాస్ వద్ద చాకలి ఐలమ్మ, దొడ్డి కొమరయ్య, సర్వాయి పాపన్న విగ్రహావిష్కరణలో ఇరు పార్టీల శ్రేణులు పాల్గొన్నారు. కొబ్బరికాయ కొట్టేందుకు బీఆర్ఎస్ నాయకులను ఎమ్మెల్యే రాజేశ్వ-ర్‌రెడ్డి ఆహ్వానించారు. ఇది బీఆర్ఎస్ పార్టీ కార్యక్రమం కాదని కాంగ్రెస్ నేతలు అభ్యంతరం తెలిపారు. ఈ క్రమంలో కాంగ్రెస్, బీఆర్ఎస్ నేతల మధ్య తీవ్ర తోపులాట జరిగింది. పల్లా గో బ్యాక్ అంటూ కాంగ్రెస్ నేతలు నినాదాలు చేశారు. రెండు పార్టీల శ్రేణులను పోలీసులు చెదరగొట్టారు.ఇరువర్గాల మధ్య వాగ్వాదం తీవ్ర స్థాయికి చేరడంతో కాంగ్రెస్, బిఆర్ఎస్ నేతల మధ్య తీవ్ర తోపులాట చేసుకుంది. ఎమ్మెల్యే పల్లా గో బ్యాక్ అంటూ నినాదాలు చేశారు కాంగ్రెస్ నేతలు. అక్కడే ఉన్న పోలీసులు అడ్డుకొని ఇరువర్గాలను చెదరగొట్టారు.

## సింగరేణి టెండర్లపై విచారణ జరపండి

- 2014 నుంచి నేటి వరకు అన్నింటిపైనా విచారణ
- కేంద్రమంత్రి కిషన్ రెడ్డికి ఎంపి చామల లేఖ

న్యూఢిల్లీ,జనవరి23(పద్మక్రాంతి):

సింగరేణిలో 2014 నుంచి ఇప్పటి వరకు జరిగిన అన్ని టెండర్లపై సమగ్ర విచారణ జరిపించాలని కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి కిషన్ రెడ్డికి కాంగ్రెస్ భువనగిరి ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి లేఖ రాశారు. ఈ లేఖలో పలు అంశాలను ప్రస్తావించారు. నైనీ కోల్ బ్లాక్ విషయంలో తలెత్తిన వివాదంపై తక్షణమే స్పందించి ఇద్దరు సభ్యులతో కూడిన బృందాన్ని విచారణకు వేసినందుకు కృతజ్ఞతలు తెలిపారు. కేవలం నైనీ కోల్ బ్లాక్ టెండర్ రద్దు అంశానికే ఈ విచారణను పరిమితం చేయొద్దని కోరారు. సింగరేణిలో గడిచిన పదేళ్లలో జరిగిన అన్ని టెండర్లు, అధికారిక పక్రియలపై సమగ్ర విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. సమగ్ర విచారణ జరిపించాల్సిన అవసరం ఎంతైనా ఉందని తాను బలంగా నమ్ముతున్నానని పేర్కొన్నారు. సింగరేణి కాలరీస్ కంపెనీ లిమిటెడ్‌లో 2014వ సంవత్సరం నుంచి ఇప్పటివరకు జరిగిన అన్నిటెండర్లు, కాంట్రాక్టులు, అధికారిక నిర్ణయాలపై పూర్తిస్థాయి విచారణ జరిపించాలని చామల కిరణ్ కుమార్ రెడ్డి కోరారు. కేసీఆర్ హయాంలో తీసుకున్న నిర్ణయాలతోపాటు, ప్రస్తుతం కొనసాగుతున్న టెండర్ పక్రియలను కూడా ఈ విచారణ పరిధిలోకి తీసుకురావాలని సూచించారు. సింగరేణి సంస్థ ప్రయోజనాలను కాపాడే దిశగా, గత పదేళ్లుగా టెండర్ల కేటాయింపుల్లో ఏవైనా అవకతవకలు జరిగి ఉంటే, వాటిని తెలంగాణ ప్రజలకు తెలియజేయాలని పేర్కొన్నారు. సింగరేణి లాంటి ప్రతిష్ఠాత్మక ప్రభుత్వ రంగ సంస్థలో పారదర్శకత, ప్రజాహితాన్ని కాపాడటం అత్యంత అవ-సరమని చెప్పుకొచ్చారు. కిషన్‌రెడ్డి వెంటనే స్పందించి 2014 నుంచి ఇప్పటివరకు జరిగిన అన్ని టెండర్ల పక్రియలను ఈ ఉన్నత స్థాయి విచారణ బృందం పరిధిలోకి తీసుకురావాలని ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి కోరారు.

# మేడారంలో పారిశుద్ధ్యానికి పెద్దపీట

- సురక్షిత తాగునీటి సౌకర్యం ఏర్పాటు
- దాదాపు 5500 తాత్కాలిక నల్లాలు ఏర్పాటు

ములుగు,జనవరి23(పద్మక్రాంతి):

దేశంలోనే అతిపెద్ద గిరిజన జాతరగా పేరుగాంచిన మేడారం సమ్మక్క జాతరకు హాజరయ్యే కోట్లాది మంది భక్తులకు సురక్షిత తాగునీటి సౌకర్యం కల్పించడంతో పాటు మేడారం జాతర ప్రాంతం మొత్తంలో పారిశుధ్య కార్యక్రమాల నిర్వహణకు రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత నిస్తోంది. ప్రధానంగా ఈ జాతరకు హాజ-రయ్యే భక్తులకు తాగునీటి సౌకర్యం, అన్ని టాయిలెట్ బ్లాక్స్ వద్ద నిరంతర నీటి సదుపాయం, అన్ని ప్రభుత్వ శాఖల వద్ద తాగునీటి సౌకర్యం, పెద్ద సంఖ్యలో టాయిలెట్ బ్లాకుల నిర్మాణం చేపట్టారు. గ్రామీణ నీటి సరఫరా విభాగం- మిషన్ భగీరథ ఆధ్వర్యంలో దాదాపు 5500 తాత్కాలిక నల్లాలు ఏర్పాటు చేశారు. వీటిలో, 517 బ్యాటరీ ఆఫ్ టాప్స్, 47 సిస్టెర్న్లు, 312 సిస్టర్న్ టాప్స్ , 10 చలివేంద్రాలున్నాయి. 2024 జాతరలో 5222 నల్లాలు మాత్రమే ఏర్పాటు చేయగా ఈసారి జాతరకు 5500 నల్లాలు ఏర్పాటుచేయడం జరిగింది. ఈజాతరకు గాను రూ. 13.70 కోట్ల వ్యయంతో గ్రామీణ నీటి సరఫరా విభాగం- మిషన్ భగీరథ శాఖ ద్వారా 57 పనులను చేపట్టడం జరిగింది. గతంలో ఉన్న సదుపాయాలకు అదనంగా, ఒక అధికుల సామ-ర్థ్యం కలిగిన బోర్ వెల్, రెండు బోరెవెల్-పంప్స్, ఐదు కొత్త సిస్టర్న్, ఒక కొత్త ఓ.ఎచ్.ఎస్.ఆర్, 26 టాయిలెట్ బ్లాక్స్, ఒక క్యూ-లైన్ నిర్మాణం, మరో 9 ఇతర పనులను చేపట్టి పూర్తి చేశారు. మేడారం ప్రధాన ఆలయం పరిసరాలు, జాతీయ రహదారి, పార్కింగ్ ప్రాంతాలు, వివిధ గ్రామాల నుండి వచ్చే దారులు, చెరువుల సమీపంలో ఈ తాగునీటి సౌకర్యంతోపాటు టాయిలెట్ లను ఏర్పాటు చేసారు. మేడారానికి వచ్చే లక్షలాది భక్తుల సౌకర్యార్థం మేడారం తోపాటు చుట్టూ పక్కల ప్రాంతాల్లో దాదాపు 5700 టాయిలెట్లను తాత్కాలికంగా నిర్మించారు. మొత్తం 285 టాయిలెట్ బ్లాకులుగా ఏర్పాటు చేసి వీటిని పరిశుభ్రరంగా నిర్వహించేందుకు 255 సిబ్బందిని ప్రత్యేకంగా నియమించారు.







ఈనెల 28 నుండి 31 తేదీ వరకు జరిగే మేడారం జాతరకు దాదాపు కోటిన్నర మంది భక్తులు హాజ-రవుతారని అంచనా వేస్తున్నారు. ఇంతటి భక్త జన సమూహానికి ఏవిధమైన ఇబ్బందులు కలుగ కుండా ఉండేందుకు ప్రభుత్వం గతంలో ఎన్నడూ లేని విధంగా ఈసారి అధిక సంఖ్యలో 5000 మంది పారిశుధ్య సిబ్బందిని ప్రత్యేకంగా నియమించింది. రోజుకు మూడు షిఫ్టులుగా పనిచేసే ఈ పారిశుధ్య సిబ్బంది, జాతర మొత్తం ప్రాంతాల్లో ఎప్పటికప్పుడు వ్యర్థాలు, చెత్తను ఏరివేస్తారు. పంచాయితీ రాజ్ శాఖ ఆధ్వర్యంలో చేపడుతున్న ఈ పారిశుధ్య కార్యక్రమాల నిర్వహణకు, జాతర మొత్తాన్ని 25 సెక్టారులుగా విభజించి 526 పర్యవేక్షక అధికారులను నియమించారు. సేకరించిన వ్యర్థాలు, చెత్తను ఎప్పటికప్పుడు తొలగించడానికి, 100 టాక్టర్లను ఏర్పాటు చేశారు. అదేవిధంగా, దుమ్ము, ధూళి లేవకుండా రహదారులపై నీటిని స్ప్రే చేయడానికి 150 వాటర్ ట్యాంకర్లను కూడా ఉపయోగిస్తున్నారు. వీటితోపాటు పారిశుధ్య కార్యక్రమాల నిర్వహణలో, వరంగల్ నగర పాలక సంస్థ, ఇతర మున్సిపాలిటీల నుండి 40 స్వచ్ఛ ఆటోలను, 16 డోజర్లు, 13 మొబైల్ టాయిలెట్స్, 18 స్వీపెంగ్ యంత్రాలు, 12 జె.సి.బి లను కూడా ప్రత్యేకంగా ఉపయోగిస్తున్నారు.

RNI No : TELTEL/2022/85167
పద్మక్రాంతి
(వాస్తవాలు వెలుగులోకి) తెలుగు దినపత్రిక

# సినిమా..

## 'కిల్' రాఘవ.. నాని ది ప్యారడైజ్‌పై సూపర్ హైప్




టాలీవుడ్ న్యాచురల్ స్టార్ నాని దసరా ఫేం శ్రీకాంత్ ఓదెల డైరెక్షన్‌లో నటిస్తోన్న చిత్రం ది ప్యారడైజ్. ఈ చిత్రంలో మోహన్ బాబు కీలక పాత్రలో నటిస్తుండగా.. ఇటీవలే విడుదల చేసిన లుక్ నెట్టింట టాక్ ఆఫ్‌దిటౌన్‌గా నిలుస్తోంది. ఈ మూవీని ఎస్‌ఎల్‌వీ సినిమాస్ బ్యానర్‌లో దసరా ఫేం సుధాకర్ చెరుకూరి తెరకెక్కిస్తున్నారు. షూటింగ్ దశలో ఉన్న ఈ సినిమాకు సంబంధించి ఆసక్తికర వార్త నెట్టింట హల్ చల్ చేస్తోంది. కిల్ యాక్టర్ రాఘవ ఈ సినిమాలో కనిపించబోతున్నాడు. ది ప్యారడైజ్‌లో భాగం కావడం పట్ల ఎక్షయిటింగ్‌కు లోనవుతున్నాడు రాఘవ. శ్రీకాంత్ ఓదెల రాఘవతో స్క్రిప్ట్ డిస్కషన్స్‌లో పాల్గొన్నాడని ఫిలింనగర్ సర్కిల్ సమాచారం. ఈసందర్భంగా శ్రీకాంత్ ఓదెల-రాఘవ కలిసి దిగిన ఫొటో ఒకటినెట్టింట ట్రెండింగ్ అవుతోంది. తాజా టాక్ ప్రకారం త్వరలోనే రాఘవ పోర్షన్‌కు సంబంధించిన సన్నివేశాలను షూటేయబోతున్నారట. ది ప్యారడైజ్ పాన్ ఇండియా సినిమా కాదని.. పాన్ వరల్డ్ ప్రాజెక్ట్ అని అంటున్నాడు రాఘవ. ఈ చిత్రాన్ని 2026 మార్చి26న ప్రధాన భారతీయ భాషలతోపాటు ఇంగ్లీష్, స్పానిష్ భాషల్లో గ్రాండ్‌గా విడుదల చేసేందుకు రెడీ అవుతున్నారు మేకర్స్.

## మరోసారి హాట్ టాపిక్‌గా మహేష్ బాబు-రాజమౌళి మూవీ




సూపర్ స్టార్ మహేష్ బాబు కథానాయకుడిగా, భారత దర్శక దిగ్గజం ఎస్‌ఎస్ రాజమౌళి దర్శకత్వంలో తెరకెక్కుతున్న పాన్ వరల్డ్ "గ్లోబ్ ట్రాటింగ్ అడ్వెంచర్ ఫిల్మ్" ఇప్పుడు మరోసారి హాట్ టాపిక్‌గా మారింది. ఈ సినిమా షూటింగ్ ప్రారంభమైనప్పటికీ, అధికారిక అప్డేట్స్ ఏవీ రాకపోవడంతో ఫ్యాన్స్ కాస్త నిరాశగానే ఉన్నారు. అయితే ఈ భారీ ప్రాజెక్ట్‌కు సంబంధించిన ఓ క్రేజీ లీక్ ఇప్పుడు వైరల్ అవుతోంది. ఇండస్ట్రీలో వినిపిస్తున్న సమాచారం ప్రకారం, మహేష్ – రాజమౌళి సినిమా టైటిల్‌గా 'వారణాసి' అనే పేరును పరిశీలిస్తున్నట్లు చెబుతున్నారు. ఇండియన్ మైథాలజీ, యాత్రల నేపథ్యంలో నిర్మించబోతున్న ఈ సినిమాపేరుగా ఈ టైటిల్ ఒక మంచి ఎంపికగా చర్చకు వస్తోంది. వారణాసి అనే నగరం భారతీయ సంస్కృతికి ప్రతీకగా నిలుస్తోంది. అంతర్జాతీయంగా కూడా ఆధ్యాత్మికతకు చిహ్నంగా గుర్తింపు పొందిన ఈ నగరం పేరు టైటిల్‌గా ఉండటం సినిమాకు ప్రత్యేకమైన పాన్ వరల్డ్ కనెక్షన్‌ని తీసుకువస్తుందని భావిస్తున్నారు. ఇక హాలీవుడ్ లెజెండరీ దర్శకుడు జేమ్స్ కామెరూన్ నవంబర్‌లో భారత్‌కు రానున్నారు. "అవతార్: ద ఫైర్ అండ్ యాష్" ప్రమోషన్‌లో భాగంగా భారత పర్యటనకు వస్తున్న కామెరూన్ చేతుల మీదుగా మహేష్ – రాజమౌళి మూవీ టైటిల్‌ను రివీల్ చేయించాలని జక్కన్న ప్రణాళిక వేస్తున్నట్లు సమాచారం. ఇలా చేయడం వల్ల ఈ సినిమా హైప్ మరింత పెరగనుంది. ఈ గ్రాండ్ మూవీలో గ్లోబల్ స్టార్ ప్రియాంక చోప్రా కథానాయికగా నటించనుండగా, పాన్ ఇండియా గుర్తింపు తెచ్చుకున్న ఆర్. మాధవన్, పృథ్వీరాజ్ సుకుమారన్ కీలక పాత్రలు పోషిస్తున్నారు. కథను బట్టి ప్రపంచవ్యాప్తంగా షూటింగ్ జరిపేందుకు ప్రణాళికలు వేస్తున్న జక్కన్న, ఈ సినిమాను ఓ విజువల్ ఎక్స్‌పీరియెన్స్‌గా మలచనున్నారు. దుర్గ ఆర్ట్స్ పతాకంపై కేఎల్ నారాయణ ఈ భారీ బడ్జెట్ ప్రాజెక్ట్‌ను నిర్మిస్తున్నారు. ఆస్కార్ విన్నర్ ఎంఎం కీరవాణి ఈ సినిమాకు సంగీతం అందించనుండగా, టెక్నికల్ టీమ్ అంతా ఇంటర్నేషనల్ లెవెల్‌లో ఉండనుంది. 'ఆర్‌ఆర్‌ఆర్' తర్వాత రాజమౌళి తెరకెక్కించనున్న ఈ చిత్రం ప్రపంచ సినిమా స్థాయిలో పెద్ద బ్లాక్‌బస్టర్ అవుతుందనే అంచనాలు ఇప్పటికే ఏర్పడ్డాయి.

## వారణాసిలో మ్యూజిక్ అదుర్స్




ప్రస్తుతం ప్రపంచవ్యాప్తంగా ట్రెండింగ్‌లో ఉన్న సినిమా 'వారణాసి'. రాజమౌళి దర్శకత్వంలో మహేశ్ బాబు హీరోగా తెరకెక్కుతోన్న ఈ యాక్షన్ అడ్వెంచర్ మూవీకి సంబంధించిన ప్రతి వార్త క్షణాల్లో వైరల్ అవుతోంది. ప్రజలు కూడా ఈ మూవీపై క్యూరియసిటీతో ఉన్నారు. తాజాగా చిత్ర సంగీత దర్శకుడు కీరవాణి ఈ సినిమాపై మ్యూజికల్ అప్‌డేట్ ఇచ్చారు. గోవా వేదికగా జరుగుతోన్న ఇంటర్నే షనల్ ఫిల్మ్ ఫెస్టివల్ ఆఫ్ ఇండియా (ఇఫి) వేడుకలకు హాజరైన కీరవాణి.. 'వారణాసి'లో సంగీతం ఎవరూ ఊహించని స్థాయిలో ఉంటుందన్నారు. 'అభిమానులు ఈ చిత్రంలో అద్భుతమైన సంగీతా న్ని వింటారు. అంతకు మించి ఇప్పుడే ఈ ప్రాజెక్ట్ గురించి ఏం చెప్పలేను. 'వారణాసి'లో మొత్తం ఆరు పాటలు ఉంటాయి. మనం చేసేపని ఏదైనా కానీ.. దానిపై మనకు స్పష్టత, మనపై మనకు నమ్మకం ఉంటే ఏవిషయమూ గందరగోళంగా అనిపించదు. ఒత్తిడి గాకూడా ఉండదు. నాకుఈ ప్రాజెక్ట్ విషయంలో ఎటువంటి గందర గోళంలేదని చెప్పారు. ఇప్పటికే ఈ సినిమాలో 'రణ కుంభ' ఆడియో సాంగ్ ప్రేక్షకులను ఆకట్టుకుంటూ యూట్యూబ్‌లో ట్రెండ్ సృష్టిస్తోం ది. రాజమౌళి తెరకెక్కించే సినిమాలకు ఆయన సోదరుడు కీరవాణి సంగీతం అందిస్తారు. గతంలో వీరిద్దరి కాంబోలో వచ్చిన 'స్టూడెంట్ నెం.1', 'యమదొంగ', 'మగధీర', 'ఈగ','బాహుబలి'లోని పాటలు నేటికీ సోషల్‌మీడియా రీల్స్‌లో వైరల్ అవుతూనే ఉన్నాయి.

## కమిటీ కుర్రోళ్లు కాంబో మళ్లీ రిపీట్..

గత ఏడాది చిన్న సినిమాగా విడుదలై అంచనాలు మించి భారీ విజయాన్ని సాధించిన 'కమిటీ కుర్రోళ్లు' సినిమా కాంబో మళ్లీ రిపీట్ కానుందన్న వార్త ఇప్పుడు సినీ వర్గాల్లో హాట్ టాపిక్‌గా మారింది. ప్రేక్షకులతో బాగా కనెక్ట్ అయ్యేలా తెరకెక్కిన ఆ చిత్రానికి దర్శకత్వం వహించిన యంగ్ టాలెంటెడ్ డైరెక్టర్ యదు వంశీ , నిర్మాత నిహారిక కొణిదెల మళ్లీ కలిసి కొత్త ప్రాజెక్ట్ కోసం చర్చలు జరుపుతున్నారని సమాచారం. విశ్వసనీయ వర్గాల ప్రకారం, ఈ కొత్త సినిమా 2026 లో సెట్స్‌పైకి వెళ్లే అవకాశంఉంది. పింక్‌ఎలిఫెంట్ పిక్చర్స్ బ్యానర్‌పై ఈ సినిమా తెరకెక్కనుంది. 'కమిటీ కుర్రోళ్లు' విజయం తర్వాత ఈ కాంబినేషన్ మళ్లీ రిపీట్ అవుతుండటంతో ఇండస్ట్రీలో ఆసక్తి నెలకొంది. 'కమిటీ కుర్రోళ్లు' సినిమాకు అనేక ప్రత్యేకతలు ఉన్నాయి. ఈ సినిమాతో 11మంది హీరోలు, 4గురు హీరోయిన్‌లు తెలుగు తెరకు పరిచయం అయ్యారు. రూ.9 కోట్ల బడ్జెట్‌తో తెరకెక్కిన ఈ సినిమా రూ.18.5 కోట్లు థియేట్రికల్ వసూళ్లు, రూ.6 కోట్లు నాన్ థియేట్రికల్ బిజినెస్ సాధించిమొత్తం రూ.24.5కోట్లు రాబట్టి సెన్సే షన్ సృష్టించింది. అవార్డుల రేసులో కూడా 'కమిటీ కుర్రోళ్లు' దుమ్ము రేపింది. సైమా 2025లో ఈ చిత్రం ఘన విజయం సాధించింది.


బెస్ట్ డెబ్యూ ప్రొడ్యూసర్‌గా నిహారిక కొణిదెల, బెస్ట్ డెబ్యూ యాక్టర్‌గా సందీప్ సరోజ్ అవార్డ్ అందుకున్నారు. అలాగే తెలంగాణ ప్రభుత్వం



ప్రకటిం చిన గద్దర్ అవార్డుల్లో కూడా రెండు ప్రతిష్ఠాత్మక పురస్కారాలను దక్కించుకుంది. జాతీయ సమైక్యత,
మత సామరస్యం, అణగారిన వర్గాల అభ్యున్నతిపై తీసిన ఉత్తమ ఫీచర్ ఫిల్మ్ అవార్డుతో పాటు ఉత్తమ డెబ్యూ డైరెక్టర్ అవార్డు యదు వంశీ దక్కించుకున్నాడు. ఇక ప్రస్తుతం పింక్ ఎలిఫెంట్ పిక్చర్స్ బ్యానర్‌పై ప్రొడక్షన్ నెం.2 గా మరో ప్రాజెక్ట్ ఇటీవలే ప్రారంభమైంది. ఈ చిత్రానికి మానస శర్మ దర్శకత్వం వహిస్తున్నారు.

## మా నిలయం.. ఓ గ్రంథాలయం





చాలామంది రిటైర్ అయ్యాక విశ్రాంతిని కోరుకుంటారు. కానీ, రిటైర్డ్‌లైఫ్‌ను సమాజానికి అంకితం చేశారు ఈ దంపతులు. ప్రభుత్వ ఉద్యోగానికి సిద్ధమవుతున్న గ్రామీణ యువత కోసం తమ నివాసాన్నే గ్రంథాలయంగా మార్చారు. నిరుద్యోగులకు బతుకుబాట చూపుతున్నారు. వారే ఖమ్మం పట్టణానికి చెందిన చావా దుర్గాభవాని, పారుపల్లి అజయ్‌కుమార్ దంపతులు. రూ.20 లక్షలు వెచ్చించి గ్రంథాలయం ఏర్పాటు చేసి, ఎలాంటి ప్రతిఫలం ఆశించకుండా ఉద్యోగార్థులకు చుక్కానిగా నిలుస్తున్న ఈ దంపతులను జిందగీ పలకరించింది. ఆ విశేషాలే ఇవి.. తమ తండ్రులు ఇద్దరూ ప్రభుత్వ ఉపాధ్యాయులు కావడంతో వాళ్ల ప్రభావం ఈ ఇద్దరిపై పడింది. ఆ స్ఫూర్తితోనే టీచరు కొలువులు సాధించారు. అందుకే వారి జ్ఞాపకార్థంగా వారి పేర్లను తమ గ్రంథాలయానికి పెట్టుకున్నారు.పెద్ద రీడింగ్ హాల్‌కు అజయ్ కుమార్ తండ్రి పేరుతో 'పారుపల్లిసత్యనారాయణ పుస్తక పూదోట' అని,మినీ రీడింగ్ హాల్‌కు దుర్గా భవాని తండ్రి పేరైన 'చావా రామారావు' అని పేరు పెట్టి విజ్ఞానాన్ని అందిస్తున్నారు. పోటీపరీక్షలతోపాటు సాహితీ ప్రియుల కోసం వివిధ భాషలకు చెందిన గ్రంథాలను ఇక్కడ పొందుపరిచారు.'ఇద్దరం గొప్పగా చదువుకున్నాం. మంచి ఉదోగ్యాల్లో స్థిరపడ్డాం! ఇక సమాజంతో మనకేంటి పని' అని ఏనాడూ అనుకోలేదు ఆ దంప తులు. ఉన్నతమైన ఉపాధ్యాయ వృత్తిని చేపట్టి.. సమాజ నిర్మాణంలో తమవంతు పాత్ర పోషించారు అజయ్, దుర్గాభవాని. పదవీ విరమణ తర్వాత కూడా అదే లక్ష్యంతో ముందుకుసాగుతున్నారు. ఖమ్మం జిల్లాకు చెందిన చావా దుర్గా భవానికి చదువంటే ఇష్టం. ఆమె తండ్రి ఉపాధ్యాయుడు కావడంతో కూతురును చక్కగా ప్రోత్సహిం చాడు. అలా కష్టపడి 1997లో ప్రభుత్వ ఉపాధ్యాయురాలిగా కొలువు సాధించింది. అదే జిల్లాకు చెందిన పారుపల్లి అజయ్‌కుమార్ కూడా చదువులో మొదట్నుంచీ చురుకే! ఇంటర్ కాగానే టీటీసీ పూర్తిచేశారు. 1986లో ఎస్‌జీటీ టీచర్‌గా తన ప్రస్థానాన్ని మొదలు పెట్టారు. అజయ్, దుర్గ బంధువులు కావడంతో ఇద్దరికీ పెద్దలు పెండ్లి నిశ్చయం చేశారు.

అజయ్ ఉద్యోగం చేస్తూనే ఉన్నత చదువులు చదివి జూనియర్ కాలేజీ అధ్యాపకుడిగా పదోన్నతి పొందారు. అధ్యాపకుడిగా రిటైర్ అయ్యారు. తండ్రి ఉపాధ్యాయ వృత్తి చేస్తున్నా.. దుర్గాభవాని బాల్యంలో ఆటుపోట్లకు కొదువ లేదు. 'బతకలేక బడిపంతులు' అనే ఆ రోజుల్లో.. వాళ్ల కుటుంబానికి ఆర్థిక ఇబ్బందులు తరచూ సవాళ్లు విసిరేవి. కొత్త పుస్తకాలు కొనాలన్నా జేబులు తడుముకోవాల్సిన పరిస్థితులు ఉండేవి. సెకండ్ హ్యాండ్ పుస్తకాలు కొని చదువు వెళ్లదీసింది దుర్గా భవాని. మరోవైపు చిన్నప్పుడు అజయ్ కుమార్ పరిస్థితీ దాదాపు ఇంతే! ఇద్దరూ కష్టాలు చూసి పెరిగిన వాళ్లు కావడంతో, వృత్తిలో స్థిరపడిన తర్వాత కష్టాల్లో ఉన్న ఇతరులను ఆదుకోవడం తమ బాధ్యతగా భావించారు. ఉప్పు, పప్పు దానం చేసి గొప్పకు పోలేదు వాళ్లు. విద్యార్థులకు అండగా నిలిచారు. ఆర్థిక స్థోమత లేని విద్యార్థులకు, ఉద్యోగాన్వేషణలో ఉన్న యువతకు అండగా నిలవాలని భావించారు.


**రూ.20 లక్షలు వెచ్చించి..:** కుటుంబ బాధ్యతలు ఎన్ని ఉన్నా.. ఉన్నంతలో నలుగురికి సాయం చేస్తూ వచ్చారు. రిటైర్ అయ్యాక కూడా పనిచేస్తూనే ఉండాలనే ఆలోచన అజయ్‌ది. తాను రిటైర్ అవ్వగానే భార్యతో 'ఇకనుంచి ఈసామాజానికి మరింత సేవ చేయాలనుంది' అని తన మనసులో మాట చెప్పారు. అందుకు ఆమె కూడా అంగీకరించింది. ఇద్దరూ ఒక్కటిగా ఆలోచించి.. తమలాగా కష్టపడి చదివి ఉద్యోగాలు సాధించాలనే వారికి చే యుతనివ్వాలని నిర్ణయానికి వచ్చారు. పదిమందికి డబ్బులివ్వడం తోనో, నాలుగు పుస్తకాలు కొనివ్వడంతోనో తమ బాధ్యత పూర్తవు తుందని అనుకోలేదు. తమ ఇంటినే గ్రంథాలయంగా మార్చారు. ఉద్యోగార్థులు, విద్యార్థులు తమ ఇంటికి వచ్చి కావాల్సినవి చదువుకునేలా ఏర్పాటు చేశారు. అలా వికసించిన విద్యావనమే 'పారుపల్లి సత్యనారాయణ పుస్తక పూదోట'. తమ ఇంట్లోని మొదటి అంతస్తు మొత్తాన్ని గ్రంథాలయంగా మార్చేశారు. రూ.20 లక్షలు వెచ్చించి.. మౌలిక వసతులు కల్పించడంతోపాటు పుస్తకాలు సమకూర్చారు.

అలా 2019లో గ్రంథాలయాన్ని ప్రారంభించారు. ప్రతి రోజూ ఉదయం ఆరు గంటల నుంచి రాత్రి పది గంటల వరకు ఇది అందరికీ అందుబాటులో ఉంటుంది. లైబ్రరీ నిర్వహణ, కొత్త పుస్తకాలు తీసుకురావడం ఇవన్నీ అజయ్‌కుమార్ పనులు. యువతకు ఉద్యోగ నోటిఫికేషన్ల వివరాలు తెలియపరచడం, సిలబస్ వివరించ డం దుర్గాభవాని కర్తవ్యం. ఇలా ఇద్దరూ కలిసి తమ ఇంటిలో 8000కు పైగా పుస్తకాలను అందుబాటులో ఉంచి.. నిరుద్యోగులకు బాసటగా నిలుస్తున్నారు.

**ఎందరికో కొలువులు:** ఖమ్మం చుట్టుపక్కల గ్రామాల నుంచి పోటీపరీక్షలకు సిద్ధమయ్యే వారికి ఈ గ్రంథాలయం ఓ దేవాలయంతో సమానం. వేలకు వేలు కట్టి కోచింగ్ తీసుకోలేని వారికి ఉచితంగా పుస్తకాలిచ్చి ఉద్యోగం వచ్చేవరకు చదివిస్తున్నారు వీళ్లు. దూరప్రాంతాలకు చెందినవాళ్లు సైతం టౌన్‌లోనే రూమ్ అద్దెకు తీసుకొని నిత్యం ఈ గ్రంథాలయానికి వచ్చి తమ ప్రిపరేషన్ కొనసాగిస్తున్నారు. ప్రారంభించిన నాటి నుంచి ఇప్పటివరకు ఇక్కడ చదువుకున్నవాళ్లలో 15 మంది పోలీసు ఉద్యోగాలు, 25 మంది టీచర్ కొలువులు సాధించడంతోపాటు పలువురు నేవీ, ఆర్మీ, రైల్వే లాంటి కేంద్ర ప్రభుత్వ ఉద్యోగాలు సాధించారు. గ్రంథాలయ నిర్వహణకు గానూ ప్రతి నెలా రూ.25 వేలకుపైగా సొంత నిధులు ఖర్చుచేస్తున్నారు అజయ్, దుర్గాభవాని దంపతులు.

భవిష్యత్తులో మరిన్ని సేవలు..:

ప్రతిపనిలో కూడా జవాబుదారీగా ఉండాలనే ఆలోచనతో వాళ్ల సన్నిహితులతో కమిటీ ఒకటి వేసుకున్నారు. ఇక్కడ చదువుకొని ఉద్యోగాలు సాధించిన వాళ్లు ఎంతో కొంత డొనేషన్ రూపంలో పంపుతుంటారు. ఆ డబ్బుతో పుస్తకాలు కొంటుంటారు. ప్రస్తుతం దుర్గాభవాని ఖమ్మం పట్టణంలోనే ప్రభుత్వ పాఠశాలలో ప్రధాన ఉపాధ్యాయురాలిగా పనిచేస్తున్నారు. లైబ్రరీ నిర్వహణలో ఇద్దరూ తలమునకలుగా ఉంటారు. భవిష్యత్తులో గ్రంథాలయాన్ని మరింత అభివృద్ధి పరచాలని భావిస్తున్నారు. ఫ్యాకల్టీని ఏర్పాటు చేసి ఉద్యోగార్థులకు ఉచిత తరగతులు నిర్వహించాలనే తలంపుతో ఉన్నారు. సర్కారు కొలువు సాధించడానికి గ్రామీణ విద్యార్థులకు తోడ్పాటు అందివ్వడమే తమ లక్ష్యం అని చెబుతున్న అజయ్, దుర్గాభవాని దంపతులకు మనమూ హ్యాట్సాఫ్ చెబుదాం!



Printed, Published and Owned by Ganji. Venkatesh, Printed At Nandini Printers H.NO . 3-29, Mankhal Village, Tukkuguda Muncipalty, Maheswaram Mandal, Ranga Reddy District - Pin Code 501359 And Published From H.NO. 3-29, Mankhal Village, Tukkuguda Muncipalty, Maheswaram Mandal, Ranga Reddy District - Pin Code 501359 Telangana State. Editor Ganji Venkatesh
RNI NO: TELTEL /2022/85167, Phone NO 9705347284, Email ID:Padmakranthi2022@gmail.com.